
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పల్నాడు జిల్లా వార్తలు

5

బుధవారం 14 మే 2025



ఉష్ణోగ్రత (అంచనా)

14-5-2025	గరిష్టం	కనిష్టం
గుంటూరు	41	29
తెనాలి	40	28
నరసరావుపేట	39	27
బాపట్ల	39	29
రెంటచింతల	39	27
చీరాల	39	29

మృత్యువేగం



రెండు కుటుంబాల్లో విషాదం

రోడ్డు ప్రమాదంలో దంపతుల మృతి

- శివాపురం వద్ద బొలేరో ట్రక్కు.. లారీ ఢీ
- బొప్పాయి కోత పనికి వస్తుండగా దుర్ఘటన
- మొత్తం నలుగురు మృతి ముగ్గురికి తీవ్రగాయాలు
- బాధితులందరూ యర్రగొండపాలెం మండల వాసులే





మృతిచెందిన రమణారెడ్డి, సుబ్బమ్మ, రామాంజి, అంకమ్మ దంపతులు



వినుకొండటౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): సొంత గ్రామంలో పనులు లేవు.. 40 కిలోమీటర్ల దూరంలోని ఓ బొప్పాయి తోటలో కోత పనులు దొరికాయి. వారం నుంచి రోజూ ప్రయాణించి పనులు చేసుకుని తిరిగి ఇళ్లకు వెళ్తున్నారు. అయితే మంగళవారం వారు ఇళ్ల నుంచి పని ప్రాంతానికి బయల్దేరేరే కానీ ఇళ్లకు చేరలేదు. వేగం ఆయా కుటుంబాల్లో విషాదం నింపింది. రెండు కుటుంబాల్లో భార్యా భర్తలు మృతి చెందగా.. ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని శివాపురం గ్రామసమీపంలో మంగళవారం ఉదయం జరిగిన ఈ దుర్ఘటనలో బాధితులందరూ ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం సమీపంలోని గడ్డమీదపల్లెకు చెందిన వారే. ఇందుకు సంబంధించిన పోలీసులు తెలిపిన వివరాలు.. వెల్లలచెరువు సమీపంలోని



వైద్యశాల వద్ద విలపిస్తున్న రమణారెడ్డి కుటుంబసభ్యులు

అడ్డ రోడ్డుకు బొప్పాయి కాయలను కోసేందుకు గడ్డమీదపల్లెకు చెందిన పగడాల రమణారెడ్డి(45), ఆయన భార్య సుబ్బమ్మ (40), జొన్నగిరి రామాంజి(36), ఆయన భార్య అంకమ్మ(28)తో పాటు కన్నెబోయిన నాగమణి, పగడాల శివమ్మ, కదిరి నాగేశ్వరరావు(డ్రైవర్) బొలేరో ట్రక్కులో వస్తున్నారు. అదే సమయంలో కొబ్బరికాయల లోడుతో వినుకొండ నుంచి మార్కాపురం వెళ్తున్న లారీ, కూలీలు ప్రయాణిస్తున్న బొలేరో ట్రక్కు వేగంగా ఎదురెదురుగా ఢీకొన్నాయి. లారీ రోడ్డుపై బోల్తా పడగా.. ట్రక్కులోని కూలీల్లో సుబ్బమ్మ, అంకమ్మ అక్కడికక్కడే మృతి చెందారు. రమణారెడ్డి, రామాంజి వినుకొండలోని వైద్యశాలకు తరలిస్తుండగా మృతి చెందారు. నాగమణి, శివమ్మ, నాగేశ్వరరావులు ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు.


నిరుపేద కుటుంబాలకు చెందిన వారే..

వేసవిలో స్వగ్రామంలో పనులు దొరకక పోవడంతో మృతుల కుటుంబాలు బొప్పాయి కాయలు కోసేందుకు వారం నుంచి వెల్లలచెరువు సమీపంలో ఓ బొప్పాయి తోటలో పనులకు వస్తున్నారు. బొలేరో ట్రక్కు నిండా కాయలు కోస్తే రూ.3700 వస్తాయి. దీంతో డ్రైవర్‌తో పాటు మిగిలిన ఆరుగురు కూలీలు ఆ మొత్తాన్ని పంచుకుంటున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం కూడా రోజులానే బయల్దేరగా మార్గమధ్యలో అనుకోని సంఘటనతో వారి కుటుంబాల్లో విషాదం అలుముకుంది. రమణారెడ్డి, సుబ్బమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. పెద్దకుమార్తె అరుణకు వివాహం చేయగా కుమారుడు వెంకటరెడ్డి, మరో కుమార్తె నవిత ఉన్నత చదువులు చదువుతున్నారు. జొన్నగిరి రామాంజి, అంకమ్మ దంపతులకు ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. తల్లిదండ్రుల మృతితో పిల్లల పరిస్థితి ఏమిటని బంధువులు కన్నీటి పర్యంతమవుతు న్నారు. ఒకే ప్రమాదంలో రెండు కుటుంబాలకు చెందిన దంపతులు మృతితో గడ్డమీదపల్లె నుంచి పెద్దసంఖ్యలో వారి బంధువులు, గ్రామస్థులు వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు చేరుకుని సంఘటనపై విచారం వ్యక్తం చేశారు.

బాధితులకు అండగా ఉంటాం : ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ

పనుల కోసం వస్తూ నలుగురు మృతి చెందడంపై ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు సంతాపం తెలిపారు. ఘటన విషయం తెలిసిన వెంటనే ఆస్పత్రికి వచ్చి మృతుల కుటుంబాలను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక సాయాన్ని అందజేస్తామన్నారు. మంత్రి లోకేశ్ సూచన మేరకు మృతదేహాలను స్వగ్రామాలకు తరలించడంతో పాటు చికిత్స పొందుతున్న బాధిత కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. యర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్ బాబు, జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, ఆర్డీవో మధులత, డీఎస్పీ నాగేశ్వరరావు బాధిత కుటుంబాలకు సంతాపం తెలిపారు.

మరమ్మతులకు.. మోక్షం



తెనాలి : ఇరువైపులా కట్టలు, గోడలు దెబ్బతిని గండ్లుపడేలా ఉన్న డెల్టా కాల్వ

ఖరీఫ్ సమీపిస్తోంది. సాగునీటి కాల్వలు చూస్తే అధ్వానం. వేసవి ముగిసేనాటికి కాల్వల మరమ్మతులు చేపట్టాలి. గత నెలలో జిల్లాల వారీగా మరమ్మతులకు సంబంధించి అధికారులు అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపారు. రోజులు గడు స్తున్నా నిధులపై ప్రభుత్వంలో స్పందన లేదు. ఈ పరిస్థితుల్లో మరమ్మతులు ఇక ఉండవని.. ఈ ఏడు కూడా కడ 'గండ్లు' తప్పవేమోనని ఆందోళనలో ఉన్న రైతులకు ప్రభుత్వం నిధులు విడుదల చేస్తూ తీపికబురు చెప్పింది. డెల్టా, నాగార్జునసాగర్ పరిధిలోని కాల్వల మరమ్మతులు సత్వరం చేపట్టాలని.. అవసరమైతే స్వల్పకాల టెండర్లు నిర్వహించి నెలాఖరుకల్లా పనులు పూర్తి చేయాలని మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశాలతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- ఇక సాగునీటి కాల్వలకు మహర్దశ
- డెల్టాకు రూ.50 కోట్లు, సాగర్‌కు రూ.37 కోట్లు
- ఐదేళ్ల తర్వాత అడిగినన్ని నిధులు మంజూరు
- నెలాఖరులోపు పూర్తి చెయ్యాలని మంత్రి నిమ్మల ఆదేశం
- అవసరమైతే స్వల్పకాల టెండర్లు పిలవాలని అధికారులకు సూచన

నరసరావుపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు ప్రభుత్వం స్పందించి మరమ్మతులకు నిధులు విడుదల చేయడంతో కృష్ణా డెల్టా, సాగర్ పరిధిలో కాల్వలకు మహర్దశ పట్టనుంది. 'కాల్వల నిర్వహణకు కాసులు కావాలి' అనే శీర్షికన ఈ నెల 6న ప్రచురితమైన కథనంపై ప్రభుత్వం స్పందించింది. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమా వేశంలో కాల్వలకు నిధులు మంజూరుపై నిర్ణయం తీసుకుంది. దీంతో అడిగినన్ని నిధులు మంజూరు చేసింది. ఈ నెలాఖరులోపు కాల్వల మరమ్మతులన్నీ పూర్తిచెయ్యాలని, అవసరమైతే స్వల్పకాల టెండర్లు పిలవాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఇరిగేషన్ అధికారులను కూడా ఆదేశించారు. దీంతో సాగునీటి సంఘాలు కాల్వల మరమ్మతుల కోసం రంగంలోకి దిగాయి. అత్యవసర మరమ్మతుల ప్రాతిపదికన పనులను సాగునీటి సంఘాలు పూర్తిచేస్తాయనే నమ్మకాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు. కృష్ణా డెల్టా కింద గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల పరిధిలో 5.71 లక్షల ఎకరాలు సాగులో ఉన్నాయి. పల్నాడు జిల్లా పరిధిలోని సాగర్ కాల్వలకింద భారీగానే సాగుభూములు ఉన్నాయి. వీటి పరిధిలోని కాల్వల మరమ్మతుల కోసం నీటిపారుదల శాఖ అధికారులు గత నెలలో ఓఅండ్‌ఎం నిధుల కింద రూ.25 కోట్లు చొప్పున రెండు డెల్టాల పరిధిలో రూ.50 కోట్ల అవసరమని ప్రతిపాదనలు పంపారు. అటు సాగర్ ఆయకట్టు పరిధిలోనూ రూ.37 కోట్లు, మైనర్ ఇరిగేషన్ అవసరాల కోసం రూ.55 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపారు. ఈ మేరకు నిధులు పూర్తిగా విడుదల కావడంతో పనులు సత్వరం చేపట్టే అవకాశం అధికారులకు లభించింది. అటు డెల్టా, ఇటు సాగర్ పరిధిలో టెండర్లు పిలవాల్సిన పనులు ఎక్కువగా లేనందున సకాలంలో సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో పూర్తిచేయడానికి అధికారులు సిద్ధమవుతున్నారు. తొలుత అత్యవసర పనులు పూర్తిచేస్తామని అధికారులు ప్రకటించారు. ఖరీఫ్‌కు పనులు పూర్తి చేసి చివరి భూములకు సైతం సాగునీటిని అందించగలమన్న ఆశాభావాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీ హయాంలో కడ'గండ్లు'

వైసీపీ హయాంలో సాగునీటి కాల్వల బాగుకు నిధులు విడుదల

(మిగతా 6వ పేజీలో)

నీటి తీరువాతో సంబంధం లేకుండా..

గత ప్రభుత్వంలో సాగునీటి కాల్వల బాగు గురించి పట్టించుకోలేదు. దీంతో ఈ ఏడాది రైతులు నీటితీరువా సక్రమంగా చెల్లించలేదు. వసూలైన నీటి తీరువాలో 80 శాతం నిధులు కాల్వల నిర్వహణకు కేటాయిస్తారు. అయితే ఈ సంవత్సరం కేవలం 10 నుంచి 25 శాతం వరకే అంటే రూ.32 కోట్లు మాత్రమే వసూలైంది. దీంతో నీటి తీరువా పూర్తిగా వసూలయ్యే వరకు ఆగాలని అధికారులు భావించారు. అప్పటి వరకు అంటే సీజన్ గడువు దాటిపోతుంది. ఈ పరిస్థితుల్లో నీటితీరువాతో సంబంధం లేకుండా కాల్వల అత్యవసర మరమ్మతులకు నిధులను మంజూరు చేయాలని ఆంధ్రజ్యోతి కథనాన్ని ప్రచురించింది. ఈ పరిస్థితుల్లో నీటి తీరువాతో సంబంధం లేకుండా మొత్తం నిధులు మంజూరు చెయ్యాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో తూర్పు, పశ్చిమ డెల్టా కాల్వలకు రూ.50 కోట్లు, సాగర్ కాల్వలకు రూ.37 కోట్లు మంజూరైనట్లు నీటి పారుదల శాఖ గుంటూరు జిల్లా నీటిపారుదల శాఖ ఇన్‌చార్జి ఎస్ఈ వెంకటరత్నం తెలిపారు.

జంపని డ్రెయిన్‌లో తూటికాడ





కాల్వల నిర్వహణకు నిధులు కావాలంటూ ఈ నెల 6న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం

ఆదరిస్తున్న ప్రజల రుణం తీర్చుకుంటా

- సంక్రాంతికి పిడుగురాళ్ల డ్రీమ్‌ప్రాజెక్టు పూర్తి
- ప్రముఖులతో సమావేశంలో ఎమ్మెల్యే యరపతినేని



పిడుగురాళ్ల, మే 13 (ఆంధ్రజ్యోతి): ముప్పై ఏళ్లుగా ఆదరిస్తున్న ప్రజల రుణం తీర్చుకుంటానని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. పిడుగురాళ్ల పట్టణాభివృద్ధిపై సలహాలు, సూచనలు, కోసం ఎమ్మెల్యే మంగళవారం పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో విద్యావంతులు, వ్యాపారవర్గాలు, వైద్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ముప్పై ఏళ్ల రాజకీయ జీవితంలో డ్రీమ్ ప్రాజెక్టు అయిన పట్టణాభివృద్ధిని సంక్రాంతికి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటానన్నారు. 2019-24 మధ్య గత పాలకులు ఏ పని పూర్తి చేయలేదని, ఆర్భాటపు ప్రకటనలకే పరిమితమయ్యారన్నారు. మెడికల్ కళాశాలను ఏడాదిలోపు పూర్తిచేసి ప్రభుత్వమే నిర్వహించేలా కృషి చేస్తానన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తానన్నారు. బైపాస్‌కు సెంట్రల్‌లైటింగ్, స్వాగతద్వారాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని, హాజరైన మేధావులు, విద్యావంతులు,వ్యాపారులు

రూ.12 కోట్లతో చెరువు అభివృద్ధి

సుమారు 10 ఎకరాల్లో రూ.12 కోట్లతో పిడుగురాళ్ల చెరువు అభివృద్ధి చేస్తానని యరపతినేని తెలిపారు. ఓపెన్ ఆడిటోరియం, ఎన్టీఆర్ బృందావనం, యోగశాల, చిన్నారులకు ఆటవిడుపుగా పార్కు ఏర్పాటు, ఆటవస్తువులను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఈ నెల 15న జానపాడు రోడ్డులో ఆర్వోబీకి శంకుస్థాపన జరుగుతుందన్నారు. 26 జిల్లాల్లో తాగునీటికి రూ.1500 కోట్లు కేటాయించగా ఒక్క గురజాల నియోజకవర్గానికే రూ.279 కోట్లు మంజూరు చేయించానన్నారు. పిడుగురాళ్లలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. పట్టణాభివృద్ధిపై మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావుతో పాటు కటకం అంకారావు, విజయసారథి, చందోలు రామకృష్ణారావు, పట్టాభి, వైద్యులు వున్నం నాగమల్లికార్జునరావు, రావిపాటి వెంకటేశ్వర్లు, భరత్‌కుమార్, శరత్‌చంద్ర, వెంగళరెడ్డి, లక్ష్మణరావు, ఆలా సాంబశివరావు, సీసీ సుబ్బారావు, కేవీ సుబ్బారావు, జీవీ నరేష్, కృష్ణకాంత్, లఘువరపు రామనాథం, పీజేఎన్ ధన్‌పలు సూచనలు చేశారు. సమావేశంలో పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, పిల్లి చెన్నారావు, సయ్యద్ అమీర్‌అలీ, కోట హరి, వున్నం సురేష్, వివి నాగేశ్వరరావు, షేక్ బాబావలి, కామిశెట్టి రమేష్, ముప్పాళ్ల సాంబయ్య, వున్నం ఆంజనేయులు పాల్గొన్నారు.

పల్నాడులో.. మూడు ఆర్వోబీలు

- రైల్వే శాఖ రూ.125.10 కోట్లు మంజూరు
- పెదకూరపాడు స్టేషన్‌యార్డు వద్ద నిర్మాణం
- తుమ్మలచెరువు-నడికుడి, సత్తెనపల్లి - రెడ్డిగూడెం మధ్య రెండు
- టెండర్ ప్రక్రియ ప్రారంభం... రెండేళ్లలో పూర్తి
- హామీని నిలబెట్టుకొన్న నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

నరసరావుపేట, గుంటూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): గుంటూరు - నడికుడి రైల్వేసెక్షన్‌లో పల్నాడు జిల్లా పరిధిలోకి వచ్చే మూడు ప్రాంతాల్లో రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ)లు మంజూరయ్యాయి. మూడు నెలల వ్యవధిలోనే వీటి నిర్మాణాలను కూడా రైల్వే శాఖ ప్రారంభించనున్నది. నిర్మాణం ప్రారంభమైన తేదీ నుంచి రెండేళ్ల వ్యవధిలో మూడు ఆర్వోబీలను పూర్తి చేయనుంది. మూడింటిని సింగిల్ ప్యాకేజ్‌లో చేర్చి టెండర్లు పిలిచింది. గత ఏడాది సార్వత్రిక ఎన్నికలకు ముందు లావు శ్రీకృష్ణదేవరాయలు తాను ఎంపీగా గెలవగానే ఆర్వోబీలకు నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఆ మేరకు అధ్యయనం చేయించి రైల్వే మంత్రికి నివేదించి నిధులు విడుదల చేయించారు. నడికుడి సెక్షన్‌లో రైళ్లు, గూడ్స్‌ల రాకపోకలతో పెదకూరపాడు, సత్తెనపల్లి - రెడ్డిగూడెం, తుమ్మలచెరువు - నడికుడి మధ్యన లెవల్ క్రాసింగ్ గేట్ల వద్ద ట్రాఫిక్ రద్దీ పెరిగింది. ఈ క్రమంలో పెదకూరపాడు యార్డులోని ఎల్‌సీ నంబరు 27, సత్తెనపల్లి-రెడ్డి గూడెం స్టేషన్ల మధ్య ఎల్‌సీ 40, తుమ్మలచెరువు - నడికుడి మధ్య ఎల్‌సీ 81 వద్ద ఆర్వోబీల నిర్మాణం ఆవశ్యకత ఏర్పడింది. గతంలో ఇలాంటి ఆర్వోబీలు నిర్మించాలంటే రైల్వే, స్థానిక సంస్థలు, ఆర్అండ్‌బీ భాగస్వామ్యం కావాల్సివచ్చేది. దాంతో అనేక సమస్యలు ఉత్పన్నమయ్యేవి. ఈ క్రమంలో ఆయా ఆర్వోబీల కోసం ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రత్యేకంగా కృషి చేశారు. ఇందులో భాగంగా మూడు ఆర్వోబీలకు రైల్వే శాఖ రూ.125 కోట్ల 10 లక్షల 45 వేల 364 నిధులను విడుదల చేసింది. క్యాపిటల్ వర్క్సు కింద వీటిని చేపట్టబోతున్నది. గతిశక్తి ప్రాజెక్టు కావడంతో నిధులకు సంబంధించి ఎలాంటి కొరత లేదు. ఈ నెల 22న టెండర్లు తెరిచి ఏజెన్సీని ఖరారు చేసేందుకు రైల్వే శాఖ సిద్ధమైంది. ఆ తర్వాత 90 రోజుల్లో అగ్రిమెంట్, 24 నెలల్లో మూడు ఆర్వోబీల నిర్మాణాలు జరుగుతాయని రైల్వేవర్గాలు తెలిపాయి.

వినుకొండకు డయాలసిస్ కేంద్రం

- రోటరీ క్లబ్ సహకారంతో త్వరలో సాకారం
- వైద్య శిబిరం ప్రారంభోత్సవంలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, మే 13 (ఆంధ్రజ్యోతి): త్వరలోనే వినుకొండకు డయాలసిస్ కేంద్రం వస్తుందని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కాటూరి వైద్యశాల సౌజన్యంతో స్థానిక గంగినేని కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని మంగళవారం జీవీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరీ క్లబ్ సహకారంతో వినుకొండ ప్రభుత్వ వైద్యశాలలో అన్ని వసతులతో కూడిన డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకు రోటరీ సభ్యులు నిధుల సమీకరణకు సిద్ధం కావాలని సూచించారు. కార్యక్రమంలో జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, యర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్ బాబు, ఆర్డీవో మధులత, రోటరీ క్లబ్ సభ్యులు, కాటూరి వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

శింగరకొండలో.. మహా పూజలు



ప్రసన్నాంజనేయస్వామి దేవాలయ రాతి మండపం

అద్దంకి, మే 13 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం మహాకుంభాభిషేకం ఈ నెల 19న జరగనున్న నేపథ్యంలో బుధవారం నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. శృంగేరి శారదపీఠం ఉత్తరాధికారి విధుశేఖరభారతీస్వామి ఆధ్వర్యంలో మహాకుంభాభిషేకం, జీవ ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు జరుగుతాయని ఈవో తిమ్మానాయుడు చెప్పారు. ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠ రోజున అద్దంకి నుంచి శింగరకొండ దేవాలయం వరకు జరిగే శోభాయాత్రలో 1500 మంది మహిళలు కలశాలతో గుండ్లకమ్మ నది నుంచి జలం తీసుకుని పాల్గొంటారన్నారు. కర్నాటక నుంచి వచ్చిన ఏనుగు శోభాయాత్ర ముందు నడుస్తుందని చెప్పారు. ఇప్పటికే 5 నదులు, 3 సముద్రాల నుంచి జలం సేకరించి తీసుకొచ్చినట్లు తెలిపారు. మహాకుంభాభిషేకానికి సుమారు 50 వేల మందికి పైగా భక్తులు హాజరవుతారనే అంచనాతో ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నదానం, మజ్జిగ, మంచినీటి బాటిళ్లు అందజేయనున్నారు.

గుంటూరులో ల్యాండ్ రికార్డ్స్
డిజిటలైజేషన్ వర్క్ షాప్

● గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో రెండు రోజులు
● పాల్గొననున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని



గుంటూరు, మే 13(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ వర్క్‌షాప్ ఈసారి గుంటూరు కేంద్రంగా జరగబోతుంది. గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో ఈ వర్క్‌షాప్ రెండు రోజులు పాటు నిర్వహించనున్నారు. దేశంలోని ప్రతి పౌరుడికి ఆధునిక సాంకేతికతతో కూడిన భూ రికార్డులను అందించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 'డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్స్ ఆధునికీకరణ' కార్యక్రమం చేపట్టింది. అందులో భాగంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ రెండు రోజుల వర్క్‌షాప్‌ను ప్రజల ముందుకు తీసుకువస్తోంది. అయితే ఈ కార్యక్రమాన్ని ఆ శాఖ కేంద్ర సహాయ మంత్రి, గుంటూరు పార్లమెంటు సభ్యుడు తన నియోజకవర్గంలో నిర్వహించేందుకు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 15, 16 తేదీల్లో గుంటూరులోని ఐటీసీ వెల్కమ్ హోటల్లో ఈ వర్క్‌షాప్‌ను కేంద్ర ప్రభుత్వం నిర్వహించనుంది. ఈ కార్యక్రమానికి పెమ్మసానితో పాటు రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, రెవెన్యూ ప్రత్యేక ప్రధాన సెక్రటరీ శ్రీమతి జయలక్ష్మి, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సెక్రటరీ మనోజ్ జోషి, వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ఇతర అదనపు సెక్రటరీలు, జాయింట్ సెక్రటరీలు, డైరెక్టర్లు కూడా ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు.

బీటెక్ సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదల

పెదకాకాని, మే 13(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలోని ఇంజనీరింగ్ కళాశాలల మూడో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను మంగళవారం పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివ ప్రసాదరావు విడుదల చేశారు. 82 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. పునఃమూల్యాంకనం కోసం మే 21 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. పరీక్షల ఫలితాలు, సమగ్ర సమాచారం ఏఎన్‌యూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

మరమ్మతులకు.. మోక్షం

(5వ పేజీ తరువాయి)

చేయలేదు. రైతుల చెల్లించిన నీటి తీరువా ఆధారంగా విడుదల చేసే ఓఅండ్ఎం నిధులనూ ఇవ్వలేదు. ఓఅండ్ఎం నిధులు ఏటా రూ.20 నుంచి రూ.25 కోట్ల వరకు అవసరమని ప్రతిపాదనలు పంపితే రూ.7 నుంచి రూ.11 కోట్లు మాత్రమే మంజూరు చేసేది. ఆ నిధులను ఖరీఫ్ సీజన్ మొదలయ్యే తరుణంలో విడుదల చేయడం.. గడువులోపు పూర్తిచేయలేకపోయారంటూ వెనక్కు తీసుకోవడం పరిపాటిగా మారింది. అరకొర పనులతో మమ అనిపించి నిధులను దోచేసిన ఘటనలు కూడా ఉన్నాయి. దీంతో గడచిన ఐదేళ్లు సాగునీటి కష్టాలతో రైతులు అల్లాడిపోయారు. నీరు లేనప్పుడు నీటి కష్టాలు వెంటాడితే, వర్షాలు ఎక్కువగా పడిన సమయంలో నీరు ఎక్కువై కాల్వలకు గండ్లుపడి, పంటలను తుడిచిపెట్టేసిన పరిస్థితులున్నాయి. సజావుగా పంట పండుతుందన్న నమ్మకంలేక పొలాలను ఖాళీగా వదిలేసిన సందర్భాలున్నాయి.

అమరావతి రాజమార్గాల పనులకు పీఎంసీల కోసం టెండర్లు

విజయవాడ, మే 13(ఆంధ్రజ్యోతి): అమరావతి ప్రధాన రాజమార్గాల పనులను వేగవంతంగా చేపట్టేందుకు వీలుగా ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ (పీఎంసీ) కోసం అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీఎల్) మంగళవారం టెండర్లు పిలిచింది. అమరావతి ప్రధాన రాజమార్గాలైన ఈ-13, ఈ-15ను రూ.750 కోట్ల వ్యయంతో చేపట్టేందుకు ఇటీవల టెండర్లు పిలిచింది. టెండర్లు కూడా ఖరారు కావస్తున్నాయి. ఈ క్రమంలో పనులను ముందుకు తీసుకు వెళ్లటానికి వీలుగా పీఎంసీలను నియమించాలని నిర్ణయించటం జరిగింది. వీరి పర్యవేక్షణలో కాంట్రాక్టు సంస్థ పనులు చేపట్టాల్సి ఉంటుంది.





తానికొండ దయాబాబు మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యేలు నక్కా ఆనందబాబు, వేగేశన నరేంద్రవర్మ

దయాబాబు మృతి టీడీపీకి తీరనిలోటు

● ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్.. ● అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు వేగేశన, ఆనందబాబు

బాపట్ల, మే13 (ఆంధ్రజ్యోతి): నిబద్ధత, అంకితభావంతో పార్టీ కోసం పనిచేసిన తానికొండ దయాబాబు మృతి తెలుగుదేశం పార్టీకి తీరనిలోటు అని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంలోనే తుదిశ్వాస విడిచిన దయాబాబు మృతదేహానికి మంగళవారం ఎంపీతో పాటు.. బాపట్ల, వేమూరు ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మ, నక్కా ఆనందబాబు, బాపుడా చైర్మన్ సలగల రాజశేఖరబాబు, బీజేపీ నాయకుడు అన్నం సతీష్ ప్రభాకర్ సందర్శించి, పుష్పాంజలి ఘటించారు. అనంతరం నిర్వహించిన అంతిమ యాత్రలో కూటమి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మృతదేహంపై తెలుగుదేశంపార్టీ జెండా ఉంచి నివాళులర్పించారు. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్రకార్యదర్శి గంటా అంజిబాబు, మాజీ కౌన్సిలర్ పేర్లి సునీల్‌కుమార్, బక్కా రోశయ్య, టీడీపీ, బీజేపీ నాయకులు తదితరులు నివాళులర్పించారు.

మాజీ ఎమ్మెల్యే రోశయ్య మా స్థలాన్ని ఆక్రమించారు

● స్థలం దగ్గరకు వస్తే చంపుతామని బెదిరిస్తున్నారు ● కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన మహిళ



జరుగుతున్న అక్రమ నిర్మాణాలు

గుంటూరు కార్పొరేషన్, మే 13(ఆంధ్రజ్యోతి): తమ స్థలాన్ని మాజీ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ఆక్రమించారని, అందులో అనధికారకంగా అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని బాధితురాలు గుమ్మడి భారతి గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. బాధితురాలి కథనం మేరకు.. గుంటూరు నగరంలోని చుట్టుగుంటలో ఉన్న కేకేఆర్ సినిమా హాల్ వెనుక భాగంలో భారతి స్థలం ఉంది. దానికి ముందు, వెనుక భాగంలో పొన్నూరు మాజీ ఎమ్మెల్యే రోశయ్యకు స్థలం ఉంది. ఈ క్రమంలో భారతిని స్థలం విక్రయించాలని గతంలో అనేక పర్యాయాలు రోశయ్య అడిగారు. అందుకు ఆమె అంగీకరించలేదు. ఈ క్రమంలో తమ స్థలాన్ని కూడా కలుపుకొని అక్రమంగా నిర్మాణం చేపడుతున్నారంటూ బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. అదేమని ప్రశ్నిస్తే రోశయ్య అనుచరులు శ్రీకాంత్, రామబ్రహ్మం తమను బెదిరిస్తున్నారని తెలిపింది. ఈ విషయమై రోశయ్యను కలిసి విన్నవిస్తే.. ఆ స్థలం తమదేనని, మీకు దిక్కున్న కాడ చెప్పుకోండి అని అన్నారని, నిర్మాణాలకు అడ్డొస్తే చంపేస్తానంటూ బెదిరిస్తున్నారని బాధితురాలు భారతి కమిషనర్, జిల్లా కలెక్టర్లకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రకృతి వ్యవసాయ విస్తరణకు సమష్టిగా కృషి చేయాలి

● రైతు సాధికార సంస్థ సీఈవో రామారావు



మాట్లాడుతున్న రైతు సాధికార సంస్థ సీఈవో రామారావు

గుంటూరు సిటీ, మే 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయ విస్తరణకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని రైతు సాధికార సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి.రామారావు పేర్కొన్నారు. మంగళవారం గుంటూరులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ప్రకృతి వ్యవసాయంపై మూడు రోజుల రాష్ట్ర స్థాయి శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. సీఈవో రామారావు మాట్లాడుతూ రాష్ట్రంలో 11.60 లక్షల మంది రైతులు 13 లక్షల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం విధానాలు అనుసరిస్తున్నారని తెలిపారు. నేషనల్ రిసోర్స్ ఆర్గనైజేషన్‌గా గుర్తించబడ్డ రైతు సాధికార సంస్థ ప్రపంచ స్థాయిలోనూ గుర్తింపు పొందిందన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల రైతుల సంక్షేమంతో పాటు ప్రజలు, నేల ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ప్రధానంగా ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్, 365 రోజుల పచ్చదనం, నేల ఆరోగ్యంపై మంచి ప్రభావం చూపుతుందని చెప్పారు. రైతు సేవ కేంద్రం సిబ్బంది రైతులు ప్రకృతి వ్యవసాయం దిశలో వెళ్లేలా ప్రోత్సహించాలని సూచించారు. మూడు రోజుల శిక్షణలో నేర్చుకొన్న అంశాలను గ్రామ స్థాయి వరకు చిత్తశుద్ధితో తీసుకువెళ్లాలని కోరారు. రైతు సాధికార సంస్థ సీనియర్ కన్సల్టెంట్ డీవీ రాయుడు, వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు శిక్షకులకు పలు సూచనలు చేశారు. రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ్‌కుమార్ వీడియో ప్రసంగాన్ని ప్రదర్శించారు. సంస్థ లీడ్‌లు గోపీచంద్, చంద్రశేఖర్, చక్రవర్తి, సీనియర్ కన్సల్టెంట్‌లు రామచంద్రం, రవిచంద్ర, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు జిల్లాలో 59,877 మెట్రిక్ టన్నుల ఎరువుల నిల్వ

సంయుక్త వ్యవసాయ సంచాలకులు కృపాదాస్



సంయుక్త వ్యవసాయ సంచాలకులు కృపాదాస్

నరసరావుపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇప్పటికి 59,877 మెట్రిక్ టన్నుల ఎరువుల నిల్వలు హోల్ సేల్, రిటైల్ దుకాణాలతో పాటు వివిధ కంపెనీల గోదాముల్లో ఉన్నాయని సంయుక్త వ్యవసాయ సంచాలకులు వీడీవీ కృపాదాస్ తెలిపారు. ఎరువుల నియంత్రణ చట్టం 1985, ఎరువుల వినియోగం పై స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాలలో మంగళవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఖరీఫ్‌లో అవసరం మేరకు.. కొరత లేకుండా జిల్లాకు ఎరువులను సరఫరా చేయడం జరుగు తోందన్నారు. చట్టానికి లోబడి నిజాయితీతో రైతులకు నష్టం లేకుండా.. వ్యాపారం చేయాలని ఎరువుల వ్యాపారులకు సూచించారు. తగు రశీదు ఇవ్వడమే కాక ఆధార్ సంఖ్యతో ఈ పాస్ నందు అమ్మకాలు నమోదు చేయాలని స్పష్టం చేశారు. జిల్లాలో 590 మందికి ఈ పాస్ పరికరాలు సరఫరా చేయడం జరిగిందన్నారు. పరికరాల నిర్వహణకు శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. జిల్లాలో మూడేళ్లలో అధిక మొత్తంలో యూరియా విక్రయించిన 1,393 మంది డీలర్లను విచారించి 334 మందికి రూ. 11,45,000 అపరాధ రుసుం విధించినట్లు వెల్లడించారు. జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి మాట్లాడుతూ గతేడాది 3,05,261 మెట్రిక్ టన్నుల ఎరువులను రైతులకు సరఫరా చేశామని చెప్పారు. పల్నాడు జిల్లా ఎరువుల వాడకంలో రాష్ట్రంలో రెండవ స్థానంలో ఉందని వెల్లడించారు. సగటున హెక్టారుకు 445 కేజీలు వివిధ పోషకాలను ఎరువుల రూపంలో వాడుతున్నారని తెలిపారు. వ్యవసాయ సంచాలకులు రాజన్, ప్రేమ్ కుమార్, రవికుమార్, వ్యవసాయ అధికారి పి.ప్రవీణ్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని బాలుడి మృతి



నరసరావుపేట లీగల్, మే 13, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్జీవో కాలనీ మొదటి వీధిలో ఉన్న ప్రత్యేక దత్తత సంస్థలో ఈ నెల 12న రాత్రి మూడేళ్ల గుర్తుతెలియని బాలుడు మృతి చెందినట్లు రెండో పట్టణ పోలీసులు తెలిపారు. వివరాల మేరకు.. ఈ నెల 11న మధ్యాహ్నం నరసరావుపేట రూరల్ పోలీసులు మూడేళ్ల అనాథ బాలుడిని తీసుకొచ్చి చేర్పించారని సంస్థ మేనేజర్ మాతంగీ కుమారి ఫిర్యాదులో పేర్కొన్నారు. సదరు బాబు శారీరకంగా మానసికంగా, బలహీనంగా ఉన్నట్లు తెలిపారు. ప్రత్యేక దత్తత సంస్థ సిబ్బంది బాబుకు రాత్రి పాలు ఇచ్చారని, అర్ధరాత్రి ఉలుకు పలుకు లేకుండా బాబు పడి ఉన్నాడని సంస్థ సిబ్బంది మేనేజర్ కుమారికి తెలియపరిచారు. ఆమె బాలుడిని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారని పేర్కొన్నారు. బాలుడి వివరాలు తెలిసిన వారు నరసరావుపేట రెండో పట్టణ పోలీస్ స్టేషన్లో, 94906 17742, 0864 7225333 నంబర్లకు సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మే 13(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం మంగళవారంకి 512.90 అడుగులు ఉంది. ఇది 136.64 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 450, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 450 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

రైతులకు ప్లాట్ల కేటాయింపు బాధ్యత కమిషనర్‌దే..

విజయవాడ, మే 13 (ఆంధ్రజ్యోతి) : అమరావతి రాజధాని ప్రాంతంతో పాటు, సీఆర్‌డీఏ పరిధిలో భూ సమీకరణ విధానాన్ని అవలంబించాల్సి వస్తే.. భూ యజమానులకు ఇచ్చే రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపు బాధ్యతలను ఇక మీదట సీఆర్‌డీఏ కమిషనర్ కానీ, అథారిటీ కానీ కేటాయింపులు జరిపే అధికారాన్ని కల్పిస్తూ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గతంలో రిటర్నబుల్ ప్లాట్లను లాటరీ పద్ధతిలో నిర్వహించేవారు.

భర్తను ముంచేసి ఉడాయించిన భార్య

రూ.80 లక్షలకుపైగా మోసం చేసిందంటూ ఫిర్యాదు

అనంతపురం, మే 13(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుడైన భర్తను మోసగించి, లక్షలాది రూపాయలతో ఉడాయించింది ఓ భార్య. దీనిపై బాధితుడు, అనంతపురం జిల్లా బెళుగుప్ప ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఇబ్రహీం ఫయాజ్ బాషా మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫయాజ్ బాషా పోలియో కారణంగా దివ్యాంగుడయ్యారు. ఆయనకు గుంటూరు జిల్లా తెనాలికి చెందిన షేక్ షబీనాతో మూడేళ్ల క్రితం వివాహమైంది. జల్సాలకు డబ్బులివ్వాలని ఆమె భర్తను బెదిరించేది. ఫయాజ్ బాషా పేరున బ్యాంకులో రూ.30 లక్షలు రుణం తీసుకుని, తన అక్క జరీనాకు ఇచ్చింది. ఇంటి స్థలాన్ని రూ.41 లక్షలకు దౌర్జన్యంగా అమ్ముకుంది. ఐదు తులాల బంగారం, రూ.6 లక్షల కారుతో గత నెల 29న పరారైంది. తన భార్యతోపాటు ఆమె అక్క, తల్లిదండ్రులు తనను మోసగించారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శివ తెలిపారు.

సబ్ ట్రెజరీలోని విగ్రహాల పరిశీలన



బాపట్ల, మే13 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల సబ్ ట్రెజరీ కార్యాలయంలో 2013లో డిపాజిట్ చేసిన విగ్రహాలను అధికారుల బృందం మంగళవారం పరిశీలించింది. 2003లో పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామ రైతు అన్వర్ ఆలీ అన్నారి పొలం మరమ్మతులు చేస్తుండగా అందులో విలువైన విగ్రహాలు, సామగ్రి బయటపడింది. అధికారులు వాటిని సేకరించి భద్రపరిచారు. అనంతరం బాపట్ల సబ్‌ట్రెజరీ కార్యాలయంలో డిపాజిట్ చేశారు. 2014లో సదరు రైతు తన పొలంలో లభించిన విగ్రహాల విలువలో కొంత తనకు ఇచ్చి ఆదుకోవాలని కోర్టును ఆశ్రయించాడు. హైకోర్టు ఆదేశాల మేరకు తాజాగా పురావస్తుశాఖాధికారుల బృందంతోపాటు పిట్టలవానిపాలెం తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు, చందోలు వీఆర్వో అరుణ ప్రసన్న, ఆర్ఐ శ్రీనివాసరావు, చందు తదితరులు కలిసి డిపాజిట్ చేసిన విగ్రహాలను, సామగ్రిని పరిశీలించి, తిరిగి డిపాజిట్ చేసి వెళ్లారు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. ఆరుగురికి గాయాలు

వినుకొండటౌన్, మే 13(ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురితో పాటు మరో వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని కొత్తపాలెం సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. బాధిత కుటుంబాల వివరాల మేరకు.. ఉత్తరప్రదేశ్ మేరేట్ నుంచి వలస వచ్చి నీలగంగవరంలో మసీదులో పనిచేస్తున్న ముజమ్మీర్, బాహర భార్యభర్తలతో పాటు అత్త షమీమ్, ఇద్దరు చిన్నారులు ద్విచక్ర వాహనంపై వినుకొండ వస్తున్నారు. వీరిని కొత్తపాలెం గ్రామానికి చెందిన పల్లెపోగు పీటర్ ద్విచక్ర వాహనంపై వస్తూ ఎదురెదురుగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అందరూ గాయపడ్డారు. హైవే అంబులెన్స్ ద్వారా పీటర్‌ను వైద్యశాలకు తరలించగా.. ముజమ్మీర్ కుటుంబ సభ్యులు ఆటోలో ఓ ప్రైవేటు వైద్యశాలకెళ్లి.. చికిత్స పొందుతున్నారు.

అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్య



ఆదినారాయణ (పాతచిత్రం)

ముప్పాళ్ళ మే13 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక కౌలురైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని చాగంటివారిపాలెంలో జరిగింది. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆళ్ల ఆదినారాయణ(45) ఏటా ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని మిర్చి, పసుపు పంటలను సాగుచేస్తుంటారు. సాగు ఖర్చులకు రూ.10 లక్షల వరకు అప్పులు చేశారు. ఈ ఏడాది కూడా ఆశించిన మేర దిగుబడి రాకపోవడం, పంటలకు మద్దతు ధర లేకపోవడంతో.. అప్పులు తీర్చే మార్గం లేదని సోమవారం ఇంటి వద్దే గడ్డిమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు నరసరావుపేట ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. చికిత్సపొందుతూ ఆదినారాయణ మంగళవారం మృతిచెందాడు. మృతునికి భార్య రమా, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

గాజుల్లంక ఇసుక క్వారీలో ఆకస్మిక తనిఖీలు

● యంత్రాలు సీజ్ చేయాలని అధికారులను ఆదేశించిన ఆర్డీవో



క్వారీలో తనిఖీలు చేస్తున్న ఆర్డీవో రామలక్ష్మి, డీఎస్పీ శ్రీనివాసరావు

కొల్లూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): గాజుల్లంక ఇసుక క్వారీలో ఆర్డీవో రామలక్ష్మి, డీఎస్పీ శ్రీనివాసరావు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఇష్టానుసారంగా ఇసుక తవ్వుతున్నారని, రాత్రిపగలు తేడా లేకుండా యంత్రాలను వినియోగిస్తూ ఇసుక తోడేస్తున్నారని రైతులు అధికారులకు వివరించారు. గుర్తించిన ప్రాంతంలో కాకుండా.. మరొక ప్రదేశంలో తవ్వకాలు జరుగుతున్నాయని స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో ఏడీ రాజేష్ కుమార్‌ను వివరణ కోరగా జియో కో-ఆర్డినేట్స్ ప్రకారం హద్దులు కాంట్రాక్టర్ చూపించడం జరిగిందని, ఇసుక తవ్వకాలు అక్కడే చేస్తున్నట్లుగా తెలిపారు. మీటరు లోతున తవ్వకాలు చేయాలని వారికి ముందే చెప్పామని ఏడీ వివరించారు. ఇప్పటికీ నదిలో భారీ యంత్రాలతోనే తవ్వకాలు సాగుతున్నాయని, మీ కళ్ల ఎదుటే నది నుంచి ఇసుక లోడ్‌తో లారీలు రావడం మీరు గమనించలేదా అంటూ అధికారులను స్థానికులు ప్రశ్నించారు. స్పందించిన ఆర్డీవో యంత్రాలు సీజ్ చేయాలని ఏడీని ఆదేశించారు. పైగా ప్రభుత్వ ఉచిత ఇసుక క్వారీని నిలుపుదల చేసి, వర్షా కాలంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా ఇసుక నిల్వ చేయిస్తున్నామని అధికారులు స్థానికులకు వివరించి, అక్కడ నుంచి నిష్క్రమించారు. తనిఖీలలో తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు, సీఐ బీవీ ఆంజనేయులు, ఏఎస్ఐ అర్జున్, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రుణం తీర్చలేక.. రైలు కింద పడి..!

వినుకొండటౌన్, మే 13, (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ బాంక్ సిబ్బంది వేధింపులు తట్టుకోలేక ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మార్కాపురం రోడ్డులోని గొర్రెల మండీ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఈపూరు మండలం కొచ్చర్ల గ్రామానికి చెందిన తొగటి బుల్లి రోశయ్య (40) కొతకాలం క్రితం ప్రైవేట్ బాంక్‌లో ఇంటిని తనకాపెట్టి రుణం తీసుకున్నాడు. క్రమం తప్పకుండా కొంత కాలంగా లోన్ చెల్లిస్తూ వచ్చాడు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులకు గురై, చేసిన అప్పులు తీర్చలేక బాంక్ రుణం చెల్లించలేక పోయాడు. ఈ క్రమంలో ప్రైవేట్ బ్యాంక్ సిబ్బంది వేధింపులు తాళలేక మూడు రోజులు క్రితం రోశయ్య ఇంటి నుండి వెళ్లిపోయినట్లు సమాచారం. చివరకు సాయంత్రం 5 సమయంలో ఇంటికి ఫోన్ చేసి తాను చనిపోతున్నట్లు ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేసినట్లు తెలిసింది. చిరవకు రైలు కింద పడి మృతి చెందినట్లు ఆప్రాంత వాసులు తెలిపారు. రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు తమకు రైల్వే కీమేన్ ఇచ్చిన వివరాలు మాత్రమే ఉన్నాయని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని తెలిపారు.

17 నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

చిలకలూరిపేట, మే13 (ఆంధ్రజ్యోతి): పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని పురస్కరించుకొని ఈ నెల 17, 18, 19 తేదీల్లో సీపీఎం, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ సంఘాల ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లాస్థాయిలో చిలకలూరిపేటలోని తూర్పు మాలపల్లిలోని చంద్రమౌళి పార్క్ క్రీడా మైదానంలో మూడు రోజులు పాటు ఫ్లడ్ లైట్ల వెలుగులో నైట్ మ్యాచ్‌లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. క్రీడాకారులు తమ జట్లను ఈ నెల 16వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు సాతులూరి హనుమంతరావు 98497 94238, ఆంజనేయ రాజు 95730 67224, సాతులూరి ప్రకాష్ 99633 73996, సాతులూరి బెంజమిన్ 86887 45866, శివ గణేష్ 63054 07457 నంబర్లకు సంప్రదించాలన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	125, 134, 145
చికెన్ విత్ స్కిన్(కిలో)	236.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	246.00

రేపు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

గురజాలటౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 16వ తేదీన ఉదయం 8 గంటలకు నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గురజాల నియోజకవర్గస్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ నగేష్, నగర పంచాయతీ కమిషనర్ శివన్నారాయణలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, కలెక్టర్ అరుణ్‌బాబుతోపాటు డివిజన్, మండలస్థాయి అధికారులు హాజరవుతారన్నారు. ఏవైనా సమస్యలుంటే ప్రజలు అర్జీ రూపంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు దృష్టికి తీసుకురావచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు.

ఎంపీడీవోగా డేవిడ్ ప్రభాకర్

పెదకూరపాడు, మే 13 (ఆంధ్రజ్యోతి) : పెదకూరపాడు ఎంపీడీవోగా కొండారెడ్డి డేవిడ్ ప్రభాకర్ బుధవారం బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటివరకు తుళ్ళూరు ఈవోపీఆర్‌డీగా విధులు నిర్వహిస్తూ బదిలీపై పెదకూరపాడు రానున్నారు.

నేడు చిల్డ్రన్స్ పార్కు ప్రారంభం

పిడుగురాళ్ల, మే 13 (ఆంధ్రజ్యోతి): చెరువు ప్రాంతంలో చిన్నారులకు ఆటవిడుపుగా ఏర్పాటు చేసిన వివిధ రకాల ఆట వస్తువులు, చిల్డ్రన్స్ పార్క్, ఫౌంటేన్, వాకింగ్ ట్రాక్‌కు సోలార్ విద్యుదీకరణను బుధవారం సాయంత్రం 6 గంటలకు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ప్రారంభించనున్నట్లు కమిషనర్ పీ శ్రీధర్ తెలిపారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, మే 13 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో మంగళవారం 22.68 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. లీకుల ద్వారా మూడు వందల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదలవుతుంది.

చౌడేశ్వరీ అమ్మవారి జ్యోతి మహోత్సవం


ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరీ అమ్మవారు

రెంటచింతల, మే 13 (ఆంధ్రజ్యోతి) : రెంటచింతలలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని శ్రీచౌడేశ్వరీ అమ్మవారి మూడో జ్యోతి మహోత్సవ వేడుకలు మంగళవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఎర్రటి ఎండను లెక్క చేయకుండా వివిధ ప్రాంతల నుంచి వందలాది మంది భక్తులు తరలివచ్చారు. మంగళవాయిద్యాల నడుమ డప్పు మేళాలతో మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. శ్రీ చౌడేశ్వరీ తల్లికి జలబిందెలు, అభిషేకాలు, పుట్టింటి సారెను సమర్పించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వెలుగు జ్యోతులను నెత్తిన పెట్టుకుని తెల్లవార్లు ఊరేగింపు నిర్వహించారు. ఆలయ పూజారి మారుతి శర్మ నేతృత్వంలో పంచామృతాబిషేకాలు జరిపారు. ఆలయ పెద్దలు శీలం నారాయణ, జోకా కొండలు, పోలిశెట్టి శ్రీనివాసరావులు దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులు గణనీయంగా హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.

కుష్ఠు బాధితులకు బియ్యం పంపిణీ

మాచర్ల రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కుష్ఠు బాధితుల కాలనీలో మంగళవారం 15 కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి 5కేజీల బియ్యంను పంచాయతీ డీఈ పీ విభూషణ్ అందజేశారు. తన తల్లిదండ్రులు చౌడమ్మ, అంకమ్మల జ్ఞాపకార్థం ప్రతి నెలా బియ్యం అందిస్తున్నారు. కార్యక్రమంలో మస్తాన్ జానీ తదితరులు పాల్గొన్నారు.

కుళాయిలకు ట్యాప్‌ల ఏర్పాటు

రెంటచింతల,మే 13 (ఆంధ్రజ్యోతి): తాగునీటి వృథా అనే శీర్షికతో మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు మల్లవరం గ్రామ కార్యదర్శి బాలునాయక్ స్పందించారు. కుళాయికు ట్యాప్‌లను ఏర్పాటు చేశారు. త్వరలో మినీ వాటర్ ట్యాంక్ పనులు పూర్తి చేస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు గాయాలు

నకరికల్లు, మే 13 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట నుంచి వెళ్తున్న ఆటోలో ఎదురుగా వస్తున్న కారు అతి వేగంగా వచ్చి ఢీకొనడంతో చిలకలూరిపేట మేజరు సమీపాన ప్రమాదం మంగళవారం జరిగింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రొంపిచర్ల మండలం మాచవరం గ్రామానికి చెందిన దార్ల బాలకోటయ్య నరసరావుపేట నుంచి ఆటోలో గ్రామానికి వెళ్ళేందుకు బయలుదేరాడు. నకరికల్లు మండలం చిలకలూరిపేట మేజరు సమీపాన ఎదురుగా వస్తున్న కారు అతివేగంతో ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ బాలకోటయ్యకు గాయాలయ్యాయి. బాలకోటయ్యను నరసరావుపేటలోని ఒక వైద్యశాలకు చికిత్స కోసం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మురళీ నాయక్‌కు నివాళి

సత్తెనపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం ప్రాణాలర్పించిన వీరజవాన్ మురళీ నాయక్‌కు మంగళవారం సత్తెనపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి న్యాయవాదులు నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు సానుభూతి తెలియజేశారు. కార్య క్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు జీ అజయ్‌కుమార్, డీ జ్ఞానరాజ్‌పాల్, జీ వెంకటకోటయ్య, ఏ వీరభాస్కర్‌రెడ్డి, మణిబాబు, కే వెంకటేశ్వరరావు, తదిరులు పాల్గొన్నారు.

అభ్యుదయ విజ్ఞానసమితి ఆధ్వర్యంలో గాంధీ బొమ్మ సెంటర్లో మురళీనాయక్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు ఎం మల్లికార్జునరావు, లింగారెడ్డి, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పాడిరైతులకు ఆసరా

- 50 శాతం సబ్సిడీపై దాణా అందజేత
- పశుధన్ యాప్‌లో నమోదై ఉండాలి


పోషణలేక బక్కచిక్కిన పాడి గేడెలు

రాజుపాలెం, మే 13(ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో పాడిరైతుల ఇబ్బందులు తీర్చటానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. రాయితీపై నాణ్యమైన పశవుల దాణా కట్టలను రైతులకు అందజేస్తుంది. వ్యవ సాయంలో యాంత్రీకరణతో ఎండు గడ్డి కొరత పాడి రైతులను ఇబ్బందులకు గురి చేస్తుంది. వేసవిలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో గ్రామాల్లో పచ్చగడ్డి దొరకడం లేదు. ఈ పరిస్థితుల్లో పశుపోషకులకు దాణా కట్టలను 50 శాతం రాయితీతో ఇస్తుంది. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం పాడి రైతులకు ఎలాంటి రాయితీలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసింది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత పాడి రైతులను అన్ని రకాలుగా ఆదుకుంటుంది. పశువుల దాణా కిలో రూ.22కు కొనుగోలు చేసి రైతులకు రూ.11కే రైతు సేవా కేంద్రాలు, పశువైద్యశాలల్లో పంపిణీ చేస్తుంది. 50 కేజీల దాణా కట్ట ధర రూ.1110 కాగా ప్రభుత్వం సబ్సిడీపై రూ.555 కు అందజేస్తుంది.

యాప్‌లో నమోదై ఉండాలి

పాడిరైతు పేరు భారత్ పశుధన్ యాప్‌లో నమోదై ఉండాలి. పశువులకు టీకాలు వేసి బీమా చేసి ఉండాలి. కేవలం తెల్లరేషన్ కార్డు కలిగిన పాడి రైతుకు మాత్రమే సబ్సిడీ దాణా ఇస్తారు. మొదటగా రైతుకు ఒక్క కట్ట మాత్రమే ఇస్తారు. గ్రామ రైతు సేవా కేంద్రంలో పేర్లు నమోదు చేసుకుని డబ్బులు చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ నిష్పత్తి ఆధారంగా ఆయా వర్గాల వారికి రైతు సేవాకేంద్రాల్లో పశువుల దాణా కేటాయింపులు ఉన్నాయి. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రాజుపాలెం మండలానికి 8 టన్నులు, బెల్లంకొండ 7 టన్నులు కేటాయించారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం

- సహాయక సంచాలకులు జి.వీరయ్య

రైతు సేవా కేంద్రాల ద్వారా అర్హత ఉన్న పోషకులందరికీ దాణా అందేవిధంగా ఏర్పాట్లు చేశాం. పాడిరైతులు పశువుల దాణా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

బాల్య వివాహాలు నేరం : సీడీపీవో సరళ


కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా మాట్లాడుతున్న క్రోసూరు సీడీపీవో సరళ

క్రోసూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలు నేరమని క్రోసూరు సీడీపీవో సరళ అన్నారు. క్రోసూరులోని అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కిషోరి వికాసం కార్యక్రమంలో ఆమె మంగళవారం మాట్లాడారు. బాల్య వివాహాల చట్టం ప్రకారం 18 సంవత్సరాల లోపు బాలికలకు, 21 సంవత్సరాల లోపు బాలురకు వివాహం చేయటం నేరమన్నారు. బాల్య వివాహాలు జరగటం వల్ల అనేక అనర్థాలు సంభవిస్తున్నాయన్నారు. సూపర్‌వైజర్ వణుకూరి మాధవి మాట్లాడుతూ బాల్య వివాహాల నిరోధక చట్టం గురించి, బాలికల అక్రమ రవాణా గురించి, లైంగిక వేదింపుల గురించి జాగ్రత్తగా ఉండాలన్నారు. మహిళా పోలీసు జీ సంధ్య పోక్సో చట్టం గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

● **బెల్లంకొండ, మే 13 (ఆంధ్రజ్యోతి) :** మండలంలోని పాపాయపాలెం పాఠశాల ఆవరణలో కిషోర్ వికాసం ద్వారా బాలికలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వనజ పేర్కొన్నారు. కిశోర్ వికాసం కార్యక్రమంలో భాగంగా చట్టాలపై అవగాహన కల్పించటం, 18 సంవత్సరాల లోపు బాల బాలికల సార్వత్రిక హక్కుల గురించి వివరించారు. కార్యక్రమంలో సుజాత, లక్ష్మి, పద్మ, సుజాత, అనిత, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

● **పెదకూరపాడు, మే 13(ఆంధ్రజ్యోతి):** కిషోర్ బాలికలకు బాలల హక్కులు, జీవన నైపుణ్యాలపై బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ మున్ని వివరించారు. మండలంలోని కన్నెగండ్లలో కిశోరి వికాసం సమ్మర్ క్యాంపెయిన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన

ముప్పాళ్ళ మే 13(ఆంధ్రజ్యోతి): పోక్సో చట్టంపై కిషోర బాలి కలు అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనంత లక్ష్మి, జీఎంఎస్‌కే రమాదేవిలు అన్నారు. మండలంలోని నార్నెపాడు అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం కిశోర వికాసంపై బాలికలకు అవగాహన కార్యక్రమం జరిగింది. అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

పెరికపాడు ఎస్సీ కాలనీ సమస్యలు పరిష్కరించాలి


ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పిస్తున్న గ్రామస్థులు

క్రోసూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెరికపాడు ఎస్సీ కాలనీలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామస్తులు మంగళవారం క్రోసూరు ఎంపీడీవో శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పించారు. ఎస్సీ కాలనీలో రహదారులు సక్రమంగా లేవని, తాగునీరు సమస్య ఉందని, డ్రెయినేజ్ సక్రమంగా లేదని, వీధి దీపాలు వెలగటం లేదని, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సమస్య వల్ల లోవోల్టేజీని ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. కాలనీలో శ్మశాన సమస్య కూడా నెలకొని ఉందన్నారు. వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. వెంటనే స్పందించిన ఎంపీడీవో గ్రామ సర్పంచ్‌కి, పంచాయతీ కార్యదర్శికి కాలనీ సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో జడ సుబ్బు, మందా రాజు, దిలీప్, సజేశ్వరరావు, ఇశ్రాయేలు, రామారావు, ఏసోబు తదితరులు పాల్గొన్నారు.

కారు లోయలో పడి ఆరుగురికి గాయాలు

● ఒకరి పరిస్థితి విషమం


లోయలో పడిన కారు

గురజాలటౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): కారు లోయలో పడి ఆరుగురికి గాయాలు కాగా వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్న ఘటన గురజాల పట్టణ శివారులోని గంగవరం వెళ్లే దారిలో హైవేపై జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం హుజూర్‌నగర్‌కు చెందిన ఆరుగురు కారులో మహానంది దైవ దర్శనానికి వెళ్లి వస్తూ తిరుగు ప్రయాణంలో పట్టణ శివారులోని గంగవరం వెళ్లే రహదారిలో హైవే వద్ద ఎదురుగా వస్తున్న కారుని తప్పించబోయి అదుపుతప్పి కారు లోయలో పడింది. ఈ ఘటనలో అంజయ్య అనే వ్యక్తి ఎడమ చేయి విరగ్గా మిగిలిన ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు గురజాల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం మిర్యాలగూడకు తరలించారు. గురజాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యాన వన పంటలతో సుస్థిర ఆదాయం

● డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి

నాదెండ్ల, మే 13 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన వన పంటలను సాగు చేయటం ద్వారా రైతులు సుస్థిర ఆదాయాన్ని సాధించగలుగుతారని డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సన్న, చిన్నకారు రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా ఉచితంగా పండ్ల తోటలను నాటించే కార్యక్రమంపై ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు, ఉద్యాన శాఖ, వ్యవసాయ సహాయకులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాణిజ్య పంటలు, సంప్రదాయ పంటల సాగు వల్ల చీడ పీడ, వర్షాభావ పరిస్థితులు, తుఫాన్‌ల వల్ల రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. ఉద్యాన పంటల సాగుద్వారానే రైతులు దీర్ఘకాలికంగా లబ్ధి పొందుతారన్నారు. ప్రతి గ్రామంలో పది ఎకరాలు పండ్ల మొక్కలు నాటే కార్యక్రమానికి సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్లాంటేషన్ మేనేజర్ కే శిరీష, హార్టికల్చర్ ఆఫీసర్ బీ విశాల్, ఏపీవో రామారావు తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు హాల్ టికెట్లు

నరసరావుపేట టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజు ఉదయం 9.30 గంటల నుంచి 12.45వరకు ఈ నెల 19వ తేదీనుంచి 28వ తేదీ వరకు జరిగే పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు హాల్‌టికెట్లు పొందవచ్చునని డీఈవో ఎల్ చంద్రకళ మంగళవారం తెలిపారు. పాఠశాలల లాగిన్‌లో ప్రధానోపాధ్యాయులు, డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ వెబ్‌సైట్‌లో విద్యార్థులు నేరుగా తమ పాఠశాల పేరు, విద్యార్థి పేరు, జిల్లా పేరు, పుట్టిన తేదీ ద్వారా, మన మిత్ర (వాట్సాప్ గవర్నెన్స్) ద్వారా హాయ్ అని 9552300009 నెంబరుకు మెసేజ్ ద్వారా హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని మేనేజ్‌మెంట్ పాఠశాలల హెచ్ఎంలు వారి పాఠశాలల లాగిన్ ద్వారా ఎస్ఎస్‌సీ మార్చి 2025లో ఉత్తీర్ణత పొందిన విద్యార్థుల షార్ట్ మెమోలు డౌన్‌లోడ్ చేసుకొని హెచ్ఎం సంతకంతో విద్యార్థులకు అందించాలన్నారు.

అన్న క్యాంటీన్‌కు రూ. 30 వేలు అందజేత


ఎమ్మెల్యే యరపతినేనికి రూ.30 వేల చెక్‌ను అందజేస్తున్న డాక్టర్ పెండ్యాల సునీల్‌కుమార్

పిడుగురాళ్ల, మే 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అన్న క్యాంటీన్ నిర్వహణ, మంచినీటి వసతి కోసం పట్టణానికి చెందిన డాక్టర్ పెండ్యాల సునీల్ కుమార్ రూ.30 వేల చెక్కును ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చేతులమీదుగా మున్సిపల్ కమిషనర్ శ్రీధర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వున్నం నాగమల్లికార్జునరావుతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వివాహ వార్షిక వేడుకలు


అచ్చంపేటలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ వివాహ వార్షికోత్సవ కేక్‌ను కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

అచ్చంపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, లావణ్య దంపతుల వివాహ వార్షిక వేడుకలు నిర్వహించారు. కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, బాపిరాజు, వెనిగండ్ల కోటయ్య, తిరువాయిపాటి ఆంజనేయులు, బత్తుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

అచ్చంపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదపాలెంలో సంగం డెయిరీలో పాలు పోస్తున్న పాలు ఉత్పత్తి దారులు బయ్యవరపు గంగయ్య ఇటీవల మృతి చెందాడు. ఆయన కుటుంబానికి సంగం డెయిరీ వెల్ఫేర్ స్కీమ్ నుండు రూ.60వేలు చెక్కును మృతుడి బంధువు పీ వెంకటేశ్వర్లుకు చెక్కును అందించారు. వెల్ఫేర్ అసోసియేషన్‌లో సభ్యుడిగా ఉన్నందున ఆర్థిక సాయం చేసినట్టు కార్యదర్శి చిరుమామిళ్ళ నరసింహారావు తెలిపారు. ఈ సందర్భంగా బీఎంసీ మేనేజర్ టీ గోపీ, సూపర్‌వైజర్ నరేష్, పాలకవర్గ సభ్యులు, పాల ఉత్పత్తిదారులు, సంఘ అధ్యక్షుడు పాటిబండ్ల వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

19న కారంపూడి ఉప ఎంపీపీ ఎన్నిక

కారంపూడి, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఖాళీగా ఉన్న ఉప ఎంపీపీ ఎన్నికకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. మండలంలోని వేపకంపల్లి వైసీపీ ఎంపీటీసీ కోకా అక్కమ్మ ఉప ఎంపీపీగా పనిచేస్తూ అనారోగ్య కారణాలతో మృతి చెందాడు. దీంతో ఎన్నిక అనివార్యమైంది. ఈ పదవిని భర్తీ చేసేందుకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేయడంతో ఈనెల 19వ తేదీన మండల పరిషత్ కార్యాలయంలో మండలపరిషత్ సభ్యులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసిన ఉప ఎంపీపీని ఎన్నుకుంటారని ఎంపీడీవో గంటా శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.

పలు గ్రామాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు

మాచవరం, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోర్జంపాడు, పిల్లుట్ల, మాచవరం సచివాలయాల్లో మంగళవారం ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. సున్నా నుంచి ఆరు సంవత్సరాలలోపు బాల బాలికలకు ఆధార్ కార్డుల్లో తప్పు ఒప్పులు సరి చేసుకోవటానికి, అడ్రస్ మార్పుల కోసం, అర్జీలు పెట్టుకొని ఆధార్ కేంద్రాలకు వెళ్లి సరి చేసుకోవాలని ఎంపీడీవో వెంగళరావు సూచించారు. ఈ అవకాశాలను సద్వినియోగ పరుచుకోవాలని తెలియజేశారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లలో రాగి వైరు చోరీ


గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ట్రాన్స్‌పార్మర్

దుర్గి, మే 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లలో రాగి వైరు చోరీ జరిగిన సంఘటన మండలంలోని ఓబులేశునిపల్లె గ్రామ శివారులో చోటు చేసుకుంది. రైతులు బాల్నీడి కిషోర్, ఆరికట్ల వెంకటేశ్వర్లు పొలాల్లో గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి రెండు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి రాగి వైరు దొంగిలించారు. బాధిత రైతులు మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ సుధీర్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాద మృతులకు శివారెడ్డి నివాళి

వెల్దుర్తి, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దావుపల్లి తండాకు చెందిన జొన్నగిరి రామాంజి, అంకమ్మ దంపతులు బొప్పాయి కాయలు కోసే కూలీ పనులకు వెళ్లి వినుకొండ నియోజకవర్గం శివాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. వారి మృతదేహాలను మంగళవారం దావుపల్లితండాకు తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న తెలుగుయువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి గ్రామానికి చేరుకొని పార్థీవదేహాల వద్ద నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు.

నేడు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం

మాచర్లటౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పూర్ణయ్య షెడ్డు బజారులో గల శ్రీగోవిందమాంబ సమేత మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ 9వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త గోలి శ్రీనివాసరావు, అర్చకుడు దొడ్డేటిపల్లి వెంకటశేషా బ్రహ్మాచార్యులు తెలిపారు. స్వామి వారి కల్యాణం, సాయంత్రం స్వామి వారి ఊరేగింపు నిర్వహిస్తామన్నారు.

తాగునీటికి రూ. 297 కోట్ల నిధులు మంజూరు

- ప్రతి ఇంటికి నీరందేలా ఎమ్మెల్యే యరపతినేని అంచనాలు పూర్తి
- త్వరలోనే టెండర్లు.. పనుల ప్రారంభం


ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, మే 13 (ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తాగునీటి సరఫరా వ్యవస్థ మెరుగ్గా ఉండాలని ఎప్పటికప్పుడు అంచనాలు, పనులు పూర్తిచేయిస్తున్నారు. పిడుగురాళ్ల పట్టణంలోని 33 వార్డుల్లో, శివారు ప్రాంతాలతో కలిపి ఇంటింటికి కుళాయి ద్వారా తాగునీరు అందించే స్కీమ్‌పై ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు దృష్టి సారించి రూ.297 కోట్లు మంజూరు చేయించారు. గోవిందాపురం నుంచి పిడుగురాళ్లకు నీటి సరఫరా అందించే వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంటుండటంతో పాటు విద్యుత్ బిల్లులు కూడా లక్షల్లో రావడం ఇప్పటికే కోటి రూపాయలకు పైగా విద్యుత్ బిల్లులు పేరుకుపోయాయి. విద్యుత్ బిల్లులు, మెయింటెనెన్స్ ఖర్చులు తగ్గించే విధంగా బుగ్గవాగు నుంచి పిడుగురాళ్ల వరకు తాగునీరు అందించే స్కీమ్‌కు యరపతినేని చేసిన రూపకల్పన విజయవంతమై నిధులు మంజూరయ్యాయి. రూ.297 కోట్లతో పట్టణంలోని ప్రతి ఇంటికి తాగునీరు అందేలా అంచనాలను తయారు చేయించారు. అవి ప్రస్తుతం టెండర్ల దశలో ఉన్నాయి. మరో రెండు నెలల్లో టెండర్లు పూర్తయి పనులు ప్రారంభించేలా ఎమ్మెల్యే అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తున్నారు.

ఘనంగా ఫాతిమా మాత ఉత్సవాలు

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ


బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్యను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, పక్కన నాగోతు శౌరయ్య, కొండవీటి రాజమోహన్

నకరికల్లు, మే 13 (ఆంధ్రజ్యోతి): తురకపాలెంలోని ఫాతిమా మాత ఉత్సవాల్లో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మంగళవారం పాల్గొన్నారు. నూతన దేవాలయాలు నిర్మించి సిల్వర్ జూబ్లీ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రజలకు అభివాదం చేశారు. మత పెద్దలు కన్నాను దీవించారు. అనంతరం కన్నా గుంటూరు జిల్లా బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్యను, తురకపాలెం తొలి గురువు కొండవీటి రాజమోహన్‌ను ఘనంగా సత్కరించారు. శాంతి మార్గాన్ని అందరూ పాటించాలని అన్నారు. నూతనంగా నిర్మించిన 14 దేవాలయాల సిల్వర్ జూబ్లీ మహోత్సవంలో కన్నా ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ ఉత్సవంలో పాల్గొనేందుకు తురకపాలెంతో పాటు రూపెనగుంట్ల, రావిపాడు, నరసరావుపేట, గుంటూరులోని వివిధ ప్రాంతాల్లో స్థిర పడిన తురకపాలెం గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగోతు శౌరయ్య, సర్పంచ్ నాగోతు దాసయ్య, సర్పంచ్ నాగోతు బాలస్వామి, విచారణ గురువు నరిశెట్టి పౌలు రాజు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు వ్యవస్థను గౌరవించడం నేర్చుకో రజిని

● టీడీపీ సీనియర్ నేత యాగంటి మల్లికార్జునరావు


మాట్లాడుతున్న యాగంటి

మాచర్లటౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మాజీ మంత్రి విడదల రజిని పోలీసు వ్యవస్థను గౌరవించడం నేర్చుకోవాలని టీడీపీ సీనియర్ నేత, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పోలీసు కేసు నమోదైన వ్యక్తిని తన కారులో మాజీ మంత్రి రజిని దాచిపెట్టడంతోపాటు పోలీసులను అడ్డుకోవడం పెద్ద నేరం, రాజ్యాంగ విరుద్ధమన్నారు. చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బరాయుడు రాజ్యాంగ బద్ధంగా మహిళా కానిస్టేబుల్ ద్వారా రజినిని తప్పుకోవాలని సూచనలు చేసిన విషయం రాష్ట్ర ప్రజలంతా చూశారన్నారు. రజినితోపాటు వాళ్ల పీఏలు అడ్డగోలుగా డబ్బులు వసూలు చేసి జనాన్ని భయపెట్టారని విమర్శించారు. ఇష్టానుసారంగా మాట్లాడితే ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడును ఎలాంటి నోటీసులు, ఎఫ్ఐఆర్ లేకుండా అక్రమంగా అరెస్ట్ చేసినప్పుడు మీ వైసీపీ పార్టీకి చట్టాలు, రాజ్యాంగం గుర్తు రాలేదా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వానికి రాజ్యాంగం, చట్టాలపై గౌరవం ఉండబట్టే మీరు రోడ్లమీదే తిరుగుతున్నారని యాగంటి అన్నారు.

మాదిగలకు ఎస్సీ కమిషన్ చైర్మన్ .. హర్షణీయం

క్రోసూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఎస్సీ కమిషన్ చైర్మన్ పదవిని మాదిగలకు కేటాయించటం హర్షణీయమని టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు దుద్దుల యోహాన్ అన్నారు. మంగళవారం క్రోసూరులో మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం ఎస్సీ కమిషన్ చైర్మన్ పదవిని మాదిగలకు కేటాయించలేదన్నారు. పార్టీని నమ్ముకున్న ఎవరికైనా చంద్రబాబు మంచి అవకాశాలు కల్పిస్తారన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయనతో పాటు దుద్దుల గోపీ, చిలకా రాంబాబు, అనీల్‌కుమార్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మంచి నీటి ఎద్దడి నివారణకు బోరు ఏర్పాటు


వేమవరంలో బోరు బావి వేస్తున్న దృశ్యం

మాచవరం, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేమవరం ఎస్సీ కాలనీలో ఉన్న మంచి నీటి ఎద్దడి నివారణకు బోరు బావి పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఎస్సీ కాలనీలో కొన్ని రోజులుగా బోరు పాడై పోవటంతో అధికారులు పరిశీలించి నూతన బోరు వేయాల్సిందిగా పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం బోరు బావి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కొలగాని శివ, ఏసుపొంగు ఆనందరావు, గోళ్ళ గంగాధర్, మోమిని సైదావలి, పెరుగు రామయ్య, పంచాయతీ అధికారులు ఉన్నారు.


బాపట్ల వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్ భవనం


విత్తనాల నాణ్యతను పరీక్షిస్తున్న ఏఈవో శ్రావణబిందు

అన్నీ ఉన్నా.. అవగాహనేదీ..?

బాపట్ల, మే 13 (ఆంధ్రజ్యోతి): రైతుల శ్రేయస్సు కోసం తీసుకొచ్చిన ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు లక్ష్య సాధనలో వెనుకబడ్డాయి. ల్యాబ్ సేవలను కర్షకులు సద్వినియోగం చేసుకునేలా చేయడంలో పూర్తి నిర్లక్ష్యం కనిపిస్తోంది. నాణ్యమైన విత్తనాలు, కల్తీలేని ఎరువులు, పనిచేయని పురుగు మందులను గుర్తించాలంటే అన్నదాతలకు చాలా కష్టం. వీటి నాణ్యత తెలుసుకునేందుకు ప్రభుత్వం ఈ అగ్రి ల్యాబ్‌లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆక్వా సాగుకు ఊతమిచ్చేందుకు ఫిషరీస్ ల్యాబ్, పశువులకు కృత్రిమ గర్భధారణకు అవసరమైన పరీక్షల ల్యాబ్‌ను ఒకేచోట ఏర్పాటు చేసింది. బాపట్ల వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణంలో నాబార్డు ఆర్‌కేవీవై నుండి రూ.90 లక్షల వెచ్చించి ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్ భవన సముదాయ నిర్మాణం చేపట్టారు. అందులో పరీక్షలకు అవసరమైన విలువైన యంత్రపరికరాలు సమకూర్చడం జరిగింది. జిల్లాలోని బాపట్లతో పాటు రేపల్లె, చీరాల నియోజకవర్గాల్లో ఈ ల్యాబ్‌లు ఉన్నాయి.


పశుసంవర్ధక శాఖ విభాగంలో ఖాళీగా కుర్చీలు

పశుసంవర్ధక ల్యాబ్ ఊసేలేదు

బాపట్ల ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చర్ ల్యాబ్‌లో పశుసంవర్ధక శాఖకు ఓ ల్యాబ్‌ను కేటాయించారు. ఒక గదిలో అవసరమైన సామగ్రి ఏర్పాటు చేశారు. అయితే ఆ శాఖ అధికారులు.. అక్కడ ఉన్న పరికరాలు మొత్తం జిల్లా కార్యాలయం దగ్గర ఉన్న ల్యాబ్‌ను తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. దీంతో ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లో ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయి. వీటిపై ఉన్నతాధికారులు స్పందించి తగిన విధంగా సేవలు అందుబాటులోకి తీసుకొచ్చి రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి అధిక ఉత్పత్తుల సాధనకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- లక్ష్యం చేరని బాపట్ల ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్
- ఇక్కడే విత్తన, ఎరువు, పురుగు మందుల నాణ్యత పరీక్షలు
- పశుసంవర్ధక, మత్స్య శాఖలకు ప్రత్యేక ల్యాబ్‌లు
- అవగాహన లేక ఆసక్తి చూపని రైతులు
- ఇంకా ప్రైవేట్ ల్యాబ్‌లకే ఆక్వా సాగుదారుల పరుగులు

రైతులకు అవగాహన ఎక్కడ.?

గ్రామీణ విత్తనోత్పత్తి పథకం కింద రైతులు పండించిన పంట శాంపిల్స్ ఇక్కడ పరీక్షించి, నాణ్యత తెలుసుకొని విత్తనాలకు విక్రయించుకునే అవకాశం ఉంది. బాపట్ల జిల్లాలో ఖరీఫ్‌లో 2,71,954 ఎకరాలు, రబీలో 3,25,961 ఎకరాలు సాగయ్యాయి. కానీ, ఇన్నేళ్లలో కేవలం 450 మంది రైతులు మాత్రమే అగ్రి ల్యాబ్‌లో పరీక్షలు చేయించుకున్నారంటే అధికారులు రైతులకు ఏమేరకు అవగాహన కల్పిస్తున్నారో అర్థమవుతుంది. బాపట్ల ల్యాబ్‌లో ఏఈవో గొర్ల శ్రావణ బిందు సీడ్ పరీక్షలు చేస్తుంది. ఏడీఏ పర్యవేక్షణలో ఒక ఏవో, ఇద్దరు ఏఈవోలు ఇక్కడ పనిచేయాల్సి ఉంది. ఇక్కడకు ఎక్కువమంది రైతులు రావడం లేదని మిగిలిన వారిని డిప్యూటేషన్ మీద పంపించారు. వచ్చే ఖరీఫ్‌కు రైతులు ల్యాబ్‌ను వినియోగించుకునే విధంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

మత్స్యశాఖ ల్యాబ్

ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌లోని ఓ విభాగంలో ఫిషరీస్ ల్యాబ్ ఉంది. ఇక్కడ ఒక ఎఫ్‌డీవోతో పాటు ఇద్దరు సాగర మిత్రలు పనిచేస్తున్నారు. ఆక్వా సాగు చేసే రైతులు ఇక్కడకు వచ్చి నీటిలో ఆక్సిజన్ పరిమాణం, క్షారత్వం, ఆమ్లత్వం, లవణీయత, మెగ్నీషియం, కాల్షియం, కాఠిన్యం, అమోనియం వంటి పరీక్షలు చేయించుకోవచ్చు. 2023లో దీనిని అందుబాటులోకి తెచ్చారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కేవలం 591 శాంపిల్స్ మాత్రమే రైతుల నుంచి వచ్చాయి. జిల్లాలో 20,389మంది రైతులు అధికారికంగా ఆక్వా సాగు చేస్తున్నారు. వీరంతా ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయించి అధిక మొత్తంలో డబ్బులు చెల్లించి, నష్టపోతున్నారు. చేపలు, రొయ్యల చెరువులలో సూర్యోదయానికి ముందు లీటరు నీరు తీసుకొని ల్యాబ్‌కు తీసుకొస్తే పరీక్షలు చేసి, ఫలితాలను చూపిస్తారు. లేదా అధికారులకు సమాచారం ఇస్తే వారే వచ్చి నీటిని తీసుకెళ్లి పరీక్ష చేసి, వివరాలు తెలియజేస్తారు.

మరోసారి గుంటూరు మహిళకు..

● రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా రాయపాటి శైలజ ● ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం ● గతంలో నన్నపనేని రాజకుమారికి అవకాశం ● కమిషన్‌పై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి


డాక్టర్ రాయపాటి శైలజ


నన్నపనేని రాజకుమారి

గుంటూరు, మే 13(ఆంధ్రజ్యోతి): మహిళా హక్కులను కాపాడే కీలకమైన మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పదవి ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో మరోసారి గుంటూరు జిల్లాకు దక్కింది. చట్టబద్ధమైన ఈ పదవిలో నియమితులైన వారిని పదవీకాలం పూర్తయ్యే వరకు తొలగించే హక్కు ఎవరికీ లేదు. మహిళలను ఎంతగానో గౌరవించే సీఎం చంద్రబాబు నాయుడు 2014లో అధికారంలోకి రాగానే నన్నపనేని రాజకుమారిని ఈ పదవికి ఎంపిక చేశారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మంత్రిగా, టీడీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలిగా పనిచేసిన రాజకుమారి రాష్ట్రంలో ఎక్కడ ఏ మహిళకు ఆపద వచ్చినా హుటాహుటిన వెళ్లి బాధితులకు అండగా నిలిచారు. మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పదవికే వన్నె తెచ్చారు. మహిళల వివాహ వయసు 18 నుంచి 22 ఏళ్లకు పెంచాలని ప్రభుత్వానికి రాజకుమారి సిఫారసు చేశారు. అప్పట్లో ఆమె పదవీకాలం ఐదేళ్లుగా నిర్ధారించటమే కాకుండా, కేబినెట్ హోదా కల్పిస్తూ చంద్రబాబు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే.. ఇబ్బందులు ఎదురవుతాయనే భయంతో మూడున్నరేళ్లకే ఆమె తన పదవికి రాజీనామా చేశారు. తిరిగి ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గుంటూరు జిల్లాకు చెందిన మహిళనే ఆ పదవికి ఎంపిక చేసింది. సీనియర్ పార్లమెంటేరియన్‌గా పేరొందిన వయోభారంతో ప్రత్యక్ష రాజకీయాల నుంచి తప్పుకున్న రాయపాటి సాంబశివరావు సోదరుడి కుమార్తె డాక్టర్ రాయపాటి శైలజకు ఈ పదవిని కట్టబెట్టారు. అమరావతి రాజధాని నిర్మాణం కోసం భూములను త్యాగం చేసిన రైతుల ఉద్యమానికి శైలజ సంపూర్ణ సహకారం అందించారు. ఆమె పోరాట పటిమను గుర్తించిన చంద్రబాబు ఈ పదవికి ఎంపిక చేశారు. అయితే శైలజకు ప్రస్తుతానికి రెండేళ్ల పాటే పదవిలో కొనసాగే అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కేబినెట్ హోదాను కూడా తదుపరి ఉత్తర్వుల్లో కల్పించే అవకాశం ఉంది. కాగా ఆమె పనితీరును బట్టి పదవీకాలాన్ని పొడిగించే అవకాశం ఉన్నట్టు కూడా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. విశేషమేమిటంటే రాజకుమారి, శైలజకు బంధుత్వం ఉంది.

విద్యుత్‌శాఖలో బదిలీలపై సందిగ్ధం

నూతన కార్యవర్గంతో తాత్కాలికంగా బ్రేక్
కొత్త సర్కిల్స్‌కు ఉద్యోగుల విముఖత

గుంటూరు, మే 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ (ఏపీ సీపీడీసీఎల్)లో ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పూర్తి సందిగ్ధంలో పడింది. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలినాళ్ల సీపీడీసీఎల్ పరిధిలోని ఉమ్మడి గుంటూరు జిల్లాను మూడు సర్కిల్స్‌గా విభజించారు. ఈ మేరకు ఉద్యోగుల విభజన ప్రక్రియలో తాత్సారం జరుగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో గుంటూరు సర్కిల్‌గా ఉన్న జిల్లాను గుంటూరు టౌన్-1 , తెనాలి డివిజన్‌తో కలిసి గుంటూరు సర్కిల్‌గా, నరసరావుపేట, మాచర్ల డివిజన్‌లతో పల్నాడు సర్కిల్‌గా, బాపట్ల డివిజన్, అద్దంకి, చీరాల డివిజన్‌లతో బాపట్ల సర్కిల్‌ను ఏర్పాటు చేశారు. సర్కిల్స్‌ను ఏర్పాటు చేసినప్పటికీ ఉద్యోగులు లేరు, కనీసం కంప్యూటర్లు వంటి మౌలిక సదుపాయాలు కూడా లేని పరిస్థితి నెలకొంది. కొత్త సర్కిల్స్‌లో ఉద్యోగులు తప్పనిసరి అని ఎస్ఈలు ఉన్నతాధికారుల దృష్టికి పలుమార్లు తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో కొత్త సర్కిల్స్‌కు ఉద్యోగుల విభజన ప్రక్రియ చేపట్టాలని సంస్థ ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఇక ప్రక్రియ పూర్తయి బదిలీలకు రంగం సిద్ధమవుతున్న నేపథ్యంలో కొత్త కార్యవర్గం నియామకంతో తాత్కాలికంగా బ్రేక్ పడినట్లయింది.

ఆదేశాలు జారీ చేసినా..

కొత్త సర్కిల్స్ విభజన నేపథ్యంలో గుంటూరు సర్కిల్ కార్యాలయం నుంచి 13 మంది పొరుగు సేవల ఉద్యోగులను బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేసినా.. వారు వెళ్లని పరిస్థితి నెలకొంది. అసలే అరకొర వేతనాలతో కాలం వెళ్లదీస్తున్న తమను జిల్లాలు దాటించేలా బదిలీలు చేస్తే ఎలాఅని తొలి నుంచి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారు.



బదిలీలకు బ్రేక్..

ప్రభుత్వం ఇటీవల ఏపీ సీపీడీసీఎల్ సీఎండీగా పుల్లారెడ్డి, టెక్నికల్ డైరక్టర్‌గా ఆవుల మురళీకృష్ణయాదవ్‌తో పాటు ఇతర డైరక్టర్లతో పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ఏర్పాటు చేసింది. దాంతో బదిలీల వ్యవహారం ప్రస్తుతానికి పెండింగ్‌లో పెట్టినట్లు సమాచారం. ప్రస్తుతం సీఎండీ పుల్లారెడ్డి గతంలో ఎస్‌పీడీసీఎల్‌లో డైరక్టర్‌గా వ్యవహరించిన సీనియర్ అధికారి, డైరక్టర్‌గా మురళీ కృష్ణయాదవ్ కూడా క్షేత్రస్థాయిలో పరిస్థితులు తెలిసిన అధికారి కావడంతో ఉద్యోగుల బదిలీల వ్యవహారం ఎలా చేయాలన్న దానిపై పూర్తిస్థాయిలో కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల కూడా సంస్థలోని ఓ ఉద్యోగ సంఘం నాయకులు ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలిసి కూడా ఉద్యోగుల బదిలీలతో కొంత వ్యతిరేకత ఉందని, ప్రస్తుతానికి నిలుపుదల చేయాలని కోరినట్లు సమాచారం. బదిలీల ప్రక్రియ తాత్కాలికంగా పెండింగ్‌లో పెట్టిన ట్లు తెలిసింది. త్వరలోనే తుది నిర్ణయం ప్రకటిస్తారని ఓ అధికారి తెలిపారు.

వేసవిలో ఫీవర్లు.. వైరల్

● ఆందోళన లేదంటున్న వైద్యవర్గాలు



గుంటూరు మెడికల్, మే 13 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా వేసవి ముగిసి, తొలకరి ప్రారంభయ్యే జూన్‌లో విష జ్వరాలు విజృంభిస్తాయి. ఇవి సాధారంగా వైరల్ ఫీవర్లుగా (ఇన్‌ఫ్లూయెంజా వైరస్) వైద్యులు చెబుతారు. వాతావరణంలో సంభవించే మార్పుల కారణంగా ఇవి విజృంభిస్తాయి. ఎండలు మండుతున్న ప్రస్తుత తరుణంలోనూ ఉమ్మడి గుంటూరు జిల్లాలో వైరల్ ఫీవర్లు వణికిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది నడి వేసవిలో వైరల్ జ్వరాలు ప్రబలడం విశేషం. వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులే ఈ జ్వరాలకు కారణమని వైద్యులు చెబుతున్నారు. గత వారం జిల్లాలో కురిసిన వర్షాలు జ్వరాలకు కారణవుతున్నట్లు వైద్యులు అభిప్రాయపడుతున్నారు. ఐదారు రోజులుగా జ్వరాలు జిల్లాను చుట్టుముట్టాయి. జ్వరం, జలుబు, ముక్కు కారడం, గొంతులో మంట, దగ్గు వంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. కొందరు రోగుల్లో వీటితో పాటు డయేరియా, ఒళ్లు నొప్పులు ఉంటున్నాయి.



జాగ్రత్తలు పాటిస్తే చాలు


డాక్టర్ రేవూరి హరికృష్ణ

వారం రోజులుగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల ఓపీకి వస్తున్న జ్వర బాధితుల సంఖ్య పెరిగింది. రోగులు రెండు రోజుల పాటు బెడ్ రెస్ట్ తీసుకొని, ద్రవ పదార్థాలు అధికంగా సులువుగా కోలుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. ఇవి అంత ప్రమాదకరం కాదని అమరావతి రోడ్‌లోని ప్రభుత్వ చాతి, శ్వాస కోస వ్యాధుల వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీకంటి రఘు తెలిపారు. ఇవి సెల్ఫ్ లిమిటింగ్ ఫీవర్లు అని, మూడు, నాలుగు రోజుల్లో అవే తగ్గిపోతున్నాయని ఆయన వివరించారు. ప్లేట్ లెట్లు తగ్గడం, ఇతర ఇబ్బందికర పరిస్థితులు ఇప్పటి వరకు తాము గుర్తించలేదని తెలిపారు. ముందస్తు జాగ్రత్తగా ఫ్లూ వ్యాక్సినేషన్ చేయించుకోవడం ఉత్తమం అని అంటు వ్యాధుల వైద్యనిపుణులు రేవూరి హరికృష్ణ సూచిస్తున్నారు. వృద్ధులు, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న ఈ వ్యాక్సిన్ తీసుకుంటే పూర్తి రణక్ష లభి స్తుందని చెబుతున్నారు.

రూ. కోట్లలో ఆడిట్ అభ్యంతరాలు

● ఎంపీడీవోలపై జడ్పీ సీఈవో ఆగ్రహం ● వాడివేడిగా సాగిన సమీక్ష సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా, చిత్రంలో సీఈవో జ్యోతి బసు, డిప్యూటీ సీఈవో కృష్ణ

గుంటూరు సిటీ, మే 13 (ఆంధ్రజ్యోతి): 'నరసరావుపేటలో రూ. 2.60 కోట్లు.. మాచవరంలో రూ.కోటి.. గుంటూరు రూరల్ రూ.1.26 కోట్లు.. క్రోసూరు రూ.97 లక్షలు.. యడ్లపాడు రూ.80 లక్షలు.. ఏ మండల పరిషత్ చూసినా ఆడిట్ అభ్యంతరాలే.. అయినా ఎంపీడీఓలు పట్టించుకోవడం లేదు.. ఇంత నిర్లక్ష్యం అయితే ఎలా అంటూ..' జడ్పీ సీఈఓ వి.జ్యోతిబసు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఎంపీడీఓలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో.. పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా అధ్యక్షతన ఎంపీడీఓల సమీక్షా సమావేశం మంగళవారం వాడివేడిగా కొనసాగింది. సీఈవో జ్యోతి బసు మాట్లాడుతూ ఎంపీడీవోలు బాధ్యత తీసుకొని ఆడిట్ అభ్యంతరాలు నిలుపుదల చేయించాలని సూచించారు. జడ్పీ ఆస్తుల పరిరక్షణపై డిప్యూటీ సీఈఓ చొప్పర కృష్ణ సమీక్ష నిర్వహిస్తూ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. కొంతమంది వివిధ రాజకీయ పార్టీల పేర్లు చెప్పి జిల్లా పరిషత్‌కు చెల్లించాల్సిన అద్దె బకాయిలు రూ.లక్షల్లో పెండింగ్ పెడుతున్నారని అన్నారు. పిడుగురాళ్ల జడ్పీ కాంప్లెక్స్ నుంచి గడచిన ఐదేళ్లలో ఒక్క రూపాయి కూడా అద్దె వసూలు కాలేదని చెప్పారు. అక్కడ రూ. 32 లక్షలు అద్దె బకాయి ఉందన్నారు. ఎంపీడీఓ అక్కడ కు వెళ్లి షాపులకు తాళాలు వేయాలని ఆదేశించారు. కొంతమంది జడ్పీ షాపింగ్ కాంప్లెక్స్ లోని గదులు రూ. 3 వేలకు అద్దెకు తీసుకొని రూ. 15 వేల అద్దెకు ఇస్తున్నారని వెల్లడించారు.

బల్లకట్టు తిరుగుతుంటే ఏం చేస్తున్నారు?

మాచవరం మండలం గోవిందా పురం బల్లకట్టు అనధికారికంగా తిప్పుతూ ఉండటం చర్చకు వచ్చింది. చైర్‌పర్సన్, డిప్యూటీ సీఈఓ కృష్ణ దీనిపై స్పందిస్తూ.. జడ్పీ ఆదాయానికి గండి కొడుతుంటే ఎంపీడీఓలు అధికారులు పట్టీపట్టనట్లు ఉండటం విచారకరమన్నారు. గోవిందాపురం వ్యవహారం లో పోలీసులకు ఫిర్యాదు చేసి, చర్యలు తీసుకోవాలని సూచించారు. జడ్పీ ఆస్తుల పరిరక్షణ బాధ్యత ఎంపీడీఓలదేనని చైర్‌పర్సన్ స్పష్టం చేశారు.

జడ్పీ లేఖలకు రెక్కలు..!

జడ్పీ ఆస్తులకు సంబంధించిన వేలం పాటల వ్యవహారంలో కొందరు అధికారులు నిర్లక్ష్యంగా ఉంటున్నారన్న విషయం చర్చకు వచ్చింది. సంబంధిత అధికారులు మాట్లాడుతూ దాచేపల్లి మండలంలోని ఇరికేపల్లి, పిడుగురాళ్ల మండలం గుత్తికొండ గ్రామాల్లో ఉన్న వ్యవసాయ భూముల వేలానికి సంబంధించిన లేఖలు జడ్పీ నుంచి ఎప్పటికప్పుడు మండలాలకు పంపామని చెప్పారు. దాచేపల్లి మండల అధికారులు మాట్లాడుతూ తమకు ఏ విధమైన లేఖలు రాలేదని ప్రతిస్పందించారు. అయితే లేఖలను మధ్యలో కాకులు ఎత్తుకుపోతున్నాయేమో అని అధికారులు పేర్కొన్నారు.

నూజెండ్ల వ్యవహారం..

సమావేశంలో నూజెండ్ల మండల పరిషత్ వ్యవహారం చర్చకు వచ్చింది. సిబ్బంది తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఎంపీడీఓ ఉమాదేవి తెలిపారు. సిబ్బంది సరిగా విధులకు హాజరుకావడం లేదని, పైగా ఎంపీడీఓ వేధిస్తుంది అంటూ పత్రికల్లో తప్పుడు వార్తలు రాయిస్తున్నారని పేర్కొన్నారు. అక్కడ ఉన్న సిబ్బందిని వెంటనే రీ-కాల్ చేయాలని ఎంపీడీఓ ఉమాదేవి జిల్లా అధికారులకు విజ్ఞప్తి చేశారు.

మాచర్ల కంటి వెలుగు


డాక్టర్ పీఎస్ఆర్ ఆంజనేయులు, మీనాక్షి కంటి ఆసుపత్రి భవనం

- డాక్టర్ పీఎస్ఆర్ ఆంజనేయులు, మీనాక్షి కంటి ఆసుపత్రి సేవలు
- 46 వేల మందికి కంటి శస్త్ర చికిత్సలు
- సకల సదుపాయాలతో అధునాతన భవనం

మాచర్లటౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలోని మాచర్లకు కంటి వెలుగైంది డాక్టర్ పీఎస్ఆర్ ఆంజనేయులు, మీనాక్షి కంటి ఆసుపత్రి. సర్వేంద్రియానం నయనం ప్రధానం.. అన్న నినాదాన్ని అందిపుచ్చుకుని పేదలకు కంటి శస్త్ర చికిత్సలు అందిస్తోంది. ఈ నియోజకవర్గంలో సుమారు 80 గిరిజన తండాలున్నాయి. అధికంగా బడుగు, బలహీన వర్గాలే ఇక్కడ జీవిస్తున్నాయి. వయస్సుపై బడిన తర్వాత కంటి శుక్లాలు, కంటిలో పొరలు, నీటి కాసులు వంటి సమస్యలొస్తే.. శస్త్ర చికిత్సలు చేయించుకునే ఇక్కడి వారికి లేదు. గతంలో వీరికి రోటరీ క్లబ్ ద్వారా ఐ క్యాంపులు నిర్వహించి, అపరేషన్ అవసరమైన వారిని పాలకొల్లు పంపించేవారు. అలా కాకుండా వెనుకబడిన పల్నాడు ప్రాంతంలోనే ప్రజలకు వైద్య సేవలందాలని మాచర్ల పట్టణంలోని సాగర్ రోడ్డులో 63 సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేశారు. ప్రస్తుత బాపట్ల జిల్లా అమృతలూరు గ్రామానికి చెందిన డాక్టర్ పీఎస్ఆర్ ఆంజనేయులు వృత్తి రీత్యా అమెరికాలో స్థిరపడ్డప్పటికీ.. ఆసుపత్రి నిర్మాణానికి సుమారు రూ. 3 కోట్లు విరాళంగా అందించారు. ఇంకో రూ. 5 కోట్ల నగదు దాతల నుంచి అందింది. దీంతో 2006లో డాక్టర్ పీఎస్ఆర్ ఆంజనేయులు మీనాక్షి కంటి ఆసుపత్రిని నిర్మించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో శంకర కంటి ఆసుపత్రి తర్వాత ఆ స్థాయిలో ఇక్కడే సేవలు నిరుపేదలకు అందుతున్నాయి.

45 వేల కంటి శస్త్ర చికిత్సలు

ఆసుపత్రిలో ఇప్పటికి 45 వేల మందికి కంటి శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించారు. నీటి కాసుల పరీక్షలు, సీజన్లో వచ్చే అంటు వ్యాధుల ట్రీట్‌మెంట్ కూడా కొనసాగిస్తున్నారు. హాస్పిటల్‌లో అధునాతనమైన థియేటర్‌లో ల్యామినార్, సాధారణ థియేటర్‌లు ఏర్పాటు చేశారు. డీఎంహెచ్‌వో నుంచి 20 పడకల ఆసుపత్రి అనుమతి కూడా లభించింది. ఈహెచ్ఎస్, ఆరోగ్యశ్రీ సదుపాయాలు కూడా అందుబాటులోకి వచ్చాయి. డిస్ట్రిక్ బ్లైండ్‌నెస్ కంట్రోల్ సొసైటీ అనుసంధానంతో ఆధార్ కార్డు ద్వారా ఉచిత వైద్యం అందిస్తున్నారు. ఎన్‌పీసీబీ (నేషనల్ ప్రోగ్రాం కంట్రోల్ ఆఫ్ బ్లైండ్‌నెస్)తో అనుసంధానం చేయడం జరిగింది. పార్మసీ, అధునాతన ల్యాబ్, కళ్లజోళ్ల షాపు, రక్త పరీక్షల ల్యాబ్ ఏర్పాటు చేయడం జరిగింది. ఇద్దరు డాక్టర్లు, 31 మంది స్టాఫ్‌తో నిరంతర సేవలు అందిస్తున్నారు.


డాక్టర్ పీఎస్ఆర్ అంజనేయులు, మీనాక్షి దంపతులు

దాతృత్వంతో..ముందుకు

-చిరుమామిళ్ల కృష్ణయ్య
ఆసుపత్రి కమిటీ చైర్మన్



డాక్టర్ పీఎస్ఆర్ ఆంజనేయులు మీనాక్షి కంటి ఆసుపత్రి కమిటీ చైర్మన్ చిరుమామిళ్ల కృష్ణయ్య దాతల నుంచి సేకరించిన నగదుతో ఆసుపత్రిని కార్పొరేట్ స్థాయిలో నిలబెట్టారు. విరాళాల్లో కొంత భాగాన్ని సమాజ శ్రేయస్సుకు ఉపయోగిస్తున్నారు. ఎస్‌బీఐ ద్వారా సీఎస్ఆర్ గ్రాంటు రూ.70 లక్షల నిధులతో రెటీనా మిషన్ పరికరాలు అందజేశారు. చైర్మన్‌తో పాటు, కమిటీ సభ్యులు దాతల నుంచి భారీగా విరాళాలు సేకరించి, కార్పొరేట్ స్థాయిలో ఇక్కడ కంటి వైద్య సేవలు అందేలా కృషి చేస్తున్నారు.

దూరవిద్య అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు హాల్ టికెట్లు

నరసరావుపేట టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రతి రోజు ఉదయం 9.30 గంటల నుంచి 12.30 గంటల వరకు దూరవిద్య పదో తరగతి, ఇంటర్మీడియెట్ మే 2025 పరీక్షలు ఈ నెల 19వ తేదీ నుంచి 24వ తేదీ వరకు జరుగుతాయని డీఈవో ఎల్.చంద్రకళ మంగళవారం తెలిపారు. అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఓపెన్‌స్కూల్.ఏపీ.జీవోవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో నేరుగా విద్యార్థి పేరు, జిల్లా పేరు, పుట్టిన తేదీతో డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. మన మిత్ర (వాట్స్‌యాప్ గవర్నెన్స్) ద్వారా హాయ్ అని 9552300009 నెంబర్‌కు మెసేజ్ చేయటం ద్వారా విద్యార్థులు తమ హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు హాల్ టికెట్లు

నరసరావుపేట టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజు ఉదయం 9.30 గంటల నుంచి 12.45వరకు ఈ నెల 19వ తేదీనుంచి 28వ తేదీ వరకు జరిగే పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు హాల్‌టికెట్లు పొందవచ్చునని డీఈవో ఎల్ చంద్రకళ మంగళవారం తెలిపారు. పాఠశాలల లాగిన్‌లో ప్రధానోపాధ్యాయులు, డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.బీఎస్‌ఈ.ఏపీ.జీవోవీ వెబ్‌సైట్‌లో విద్యార్థులు నేరుగా తమ పాఠశాల పేరు, విద్యార్థి పేరు, జిల్లా పేరు, పుట్టిన తేదీ ద్వారా, మన మిత్ర (వాట్సాప్ గవర్నెన్స్) ద్వారా హాయ్ అని 9552300009 నెంబరుకు మెసేజ్ ద్వారా హెల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని మేనేజ్‌మెంట్ పాఠశాలల హెచ్‌ఎంలు వారి పాఠశాలల లాగిన్ ద్వారా ఎస్ఎస్‌సీ మార్చి 2025లో ఉత్తీర్ణత పొందిన విద్యార్థుల షార్ట్ మెమోలు డౌన్‌లోడ్ చేసుకొని ఆయా మెమోలను ప్రధానోపాధ్యాయుల సంతకంతో విద్యార్థులకు అందించాలన్నారు. వాటితో తదుపరి కోర్సులలో జాయిన్ కావచ్చని, వాటిలో ఏమైనా తప్పులు ఉంటే వెంటనే పాఠశాలలో ఉన్న అడ్మిషన్ రికార్డు ప్రకారం పరిశీలించి, అడ్మిషన్ రిజిష్టర్ కాపీ, మార్కుల మెమోను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ధ్రువీకరించి 25వ తేదీలోపు డైరెక్టర్, ప్రభుత్వ పరీక్షల విభాగం, గొల్లపూడి, విజయవాడకు పంపాలన్నారు.

వ్యాపారవేత్త పెనుగొండ మృతి

నరసరావుపేట రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, వైభవ్ జూవెలర్స్ అధినేత, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పెనుగొండ వెంకటేశ్వరరావు (80) మంగళవారం మృతి మృతి చెందారు. మాజీ మంత్రి కాసు వెంకటకృష్ణారెడ్డి సంతాపం తెలియజేశారు

లారీ, కారు ఢీ: ఇద్దరు మహిళలకు గాయాలు

కృష్ణాపురం (శావల్యాపురం) మే 13 (ఆంధ్రజ్యోతి): లారీ, కారు ఎదురెదురుగా ఢీకొనడంతో కారులో ఉన్న ఇద్దరు మహిళలకు గాయాలైన సంఘటన గుంటూరు-కర్నూలు జాతీయ రహదారిపై మండలంలోని కృష్ణాపురం గ్రామం వద్ద మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం శావల్యాపురం మండలం వేల్పూరు నుంచి వినుకొండకు వెళుతున్న కారు కృష్ణాపురం వద్ద వినుకొండ నుంచి నరసరావుపేట వైపు మిర్చిలోడుతో వెళుతున్న లారీని ఎదురుగా వచ్చి ఢీకొట్టడంతో కారులోని చిన్నమ్మకు ఎడమకాలు విరగగా, అంజమ్మ తలకు, చేతికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు శావల్యాపురం 108కి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి క్షతగాత్రులను వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. స్థానిక ఎస్ఐ లేఖ్య లోకేశ్వరరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసును నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కేంద్రీయ విద్యాలయంలో నూరు శాతం ఫలితాలు

నాదెండ్ల, మే 13 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి సీబీఎస్ఈ ఫలితాల్లో ఇర్లపాడు కేంద్రీయ విద్యాలయం నూరుశాతం ఉత్తీర్ణత సాధించింది. మొత్తం 30మంది పరీక్షలకు హాజరవ్వగా 30మంది ఉత్తీర్ణులయ్యారు. కేంద్రీయ విద్యాలయం టాపర్‌గా కారసాల రఘుప్రియ 500మార్కులకు గాను 437 మార్కులతో ప్రథమస్థానం, పోట్ర తపస్విని 435 మార్కులతో ద్వితీయస్థానాన్ని, షేక్ సిర్గాదాసు తస్వీరు 425మార్కులతో తృతీయ స్థానాన్ని సాధించింది. తొలి బ్యాచ్‌లోనే నూరుశాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ నీరజ్‌కుమార్, శ్రీవాత్సవ, సిబ్బంది అభినందించారు.

150 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

నాదెండ్ల, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాదెండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళలకు క్యాన్సర్ స్క్రీన్ పరీక్షలను మంగళవారం నిర్వహించారు. ఓమేగా క్యాన్సర్ ఆస్పత్రి వారి సౌజన్యంతో 150 మందికి ఈ పరీక్షలు చేశారు. సుమారు ఒక్కొక్కరికి రూ.10వేలు విలువైన ఈ పరీక్షలను ఉచితంగా చేసినట్టు వైద్యాధికారి డాక్టర్ సాయి శ్వేత తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో పీ కమల, రోశమ్మ, భవానీ, దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు తైవాన్ స్ప్రేయర్లు పంపిణీ

నాదెండ్ల, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాతులూరులో 11మంది రైతులకు రాయితీపై ప్రభుత్వం అందించిన 11 తైవాన్ స్ప్రేయర్లను మంగళవారం పంపిణీ చేశారు. వీటితో పాటు ఒక ట్రాక్టర్ గొర్రును కూడా అందజేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ, నాయకులు కమ్మ శ్రీనివాసరావు, కిషోర్ కుమార్, అంకారావు, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు కోటి సుబ్బారావు మృతి

నర్సరావుపేట రూరల్, మే 13, (ఆంధ్రజ్యోతి) పట్టణానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కడియం కోటి సుబ్బారావు మంగళవారం ఆకస్మికంగా మృతి చెందారు. బుధవారం ఉదయం ఆయన అంతిమయాత్ర జరుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది.

గ్రామాల్లో మురుగు కాల్వలు లేక ఇక్కట్లు

- రోడ్లపై పారుతున్న మురుగుతోనే సహజీవనం
- వ్యాధుల బారిన ప్రజలు.. పట్టించుకోని పాలకులు..

ఈపూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివారు గ్రామాలలో ప్రజలు మురుగు నీటితోనే సహజీవనం చేస్తున్నారు. రూ.లక్షలు ఖర్చుపెట్టి సిమెంట్ రోడ్లు అయితే నిర్మించారు. కాని సైడ్‌డ్రెయిన్లు నిర్మించకపోవడంతో మురుగు నీరంతా రోడ్డు పైన చేరి మురుగుకుంటలుగా ఏర్పడుతున్నాయి. మురుగుతో దుర్వాసన రావడంతో పాటు దోమలు చేరి ఆ ప్రాంతంలో నివశించే వారు వ్యాధుల బారినపడుచున్నారు.



ఈపూరు శివారు యర్రబాలెం గ్రామంలో మురుగు కాల్వలు లేక రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు



శ్రీనగర్‌లో మురుగు కాల్వలు లేకుండా నిర్మించిన సీసీ రోడ్డు

అధికారులు పట్టించుకోరు.. పాలకులు స్పందించరు.. ఇదీ శివారు గ్రామాల ప్రజల దుస్థితి. శ్రీనగర్, యర్రబాలెం, కొత్తనెల్లూరు, సత్యన్నారాయణపురం, కూచినపల్లిలో సీసీ రోడ్లు నిర్మించి వదిలేశారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి మురుగు కాల్వలను నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చేతి పంపు చుట్టూ మురుగు

ఈపూరు మండలంలోని కంట్రోల్ మెట్ల గ్రామంలో చేతిపంపు చుట్టూ మురుగు మురుగు చేరింది. శివాలయం వీధిలో పంచాయతీ వారు ఏర్పాటుచేసిన చేతిపంపు చుట్టూ మురుగు నీరు నిల్వ ఉండడంతో అక్కడ దోమల చేరి ఆ ప్రాంతంలో నివసించే వారికి ఇబ్బందిగా మారింది. దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతిపంపు చుట్టూ చేరిన మురుగును తొలగించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



కొండ్రముట్లలో చేతి పంపుచుట్టూ నిల్వ ఉన్న మురుగు

నరసరావుపేటలో పోలీసుల తనిఖీలు

నరసరావుపేట లీగల్, మే 13 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాస్ ఆదేశాల మేరకు నరసరాపేట డీఎస్పీ కె.నాగేశ్వర్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని మొదటి పట్టణ పోలీస్ స్టేషన్ సమీపంలోని మున్సిపల్ ఆఫీస్ వద్ద పోలీసులు భారీగా వాహన తనిఖీలు నిర్వహించారు. ట్రాఫిక్ నియమాలు పాటించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న వాహనదారులపై కొరడా ఝులిపించారు. పెండింగ్ చలానాలు చెల్లించని వాహన చోదకులపై చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. వన్‌టౌన్ సీఐ చరణ్ మాట్లాడుతూ, వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. పాత చలానాలు చెల్లించాలని లేనిపక్షంలో చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. అనంతరం పట్టణంలోని సినిమా హాలు ప్రధాన కూడళ్లలో తనిఖీచేశారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్ఐ వంశీకృష్ణ, ఎస్ఐ అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.



సినిమా హాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ చరణ్ సిబ్బంది

వినియోగదారులకు అవగాహన సదస్సు

నర్సరావుపేట లీగల్, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వినియోగదాల దినోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలోని ప్రకాష్ నగర్‌లోని తూనికలు కొలతలు శాఖ కార్యాలయంలో వివిధ రకాల వ్యాపార సంస్థలకు వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎడిబుల్ ఆయిల్, రిటైల్ రైస్ షాపుల అసోసియేషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. వినియోగదారులకు ఎలాంటి అవకతవకలు జరుగకుండా చట్టపరమైన అంశాలు వివరించారు. సదస్సులో తూనికలు కొలతలు శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ అల్లూరయ్య, ఇన్‌స్పెక్టర్ సాయి శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

మేడికొండ చిన్నమ్మకు పలువురి నివాళి

రొంపిచర్ల, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్ల గ్రామానికి చెందిన మేడికొండ చిన్నమ్మ ఈ నెల 12వ తేదీన మృతి చెందింది. కాగా మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి, డాక్టర్ కొండపల్లి వెంకటేశ్వరరావు, మండలంలోని వివిధ పార్టీల నేతలు నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణానికి మార్కింగ్

- పది నెలల్లో ప్రజలకు అందుబాటులోకి
- హెచ్‌డీఎస్ చైర్మన్ డాక్టర్ లక్కిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి



ప్రభుత్వ వైద్యశాలలో మార్కింగ్‌ను పర్యవేక్షిస్తున్న డాక్టర్ లక్కిరెడ్డి

నరసరావుపేట లీగల్, మే 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లింగంగుంట్లలోని ప్రాంతీయ ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో 75పడకల క్రిటికల్ నిర్మాణానికి పనులు ప్రారంభమయ్యాయి. మంగళవారం క్రిటికల్ కేర్ యూనిట్‌కు కేటాయించిన స్థలంలో ఏపీఎం ఎస్ఐడీసీ ఆధ్వర్యంలో మార్కింగ్ నిర్వహించారు. హెచ్‌డీఎస్ చైర్మన్ డాక్టర్ లక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి ప్రత్యేక చొరవతో యూనిట్ త్వరితగతిన నిర్మాణానికి కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా 18కోట్ల వ్యయంతో నిర్వహించనున్న బిల్డింగ్ నిర్మాణానికి సంబంధించి మంగళవారం మార్కింగ్ పూర్తయింది. ఏపీ ఎంఎస్ఐడీసీ ఈఈ ఆధ్వర్యంలో డీఈ హనుమంతరావు నాయక్, ఏఈ సాయిలు మార్కింగ్‌ను నిర్వహించారు. మొత్తం ఈ ప్రాజెక్టు నిర్మాణానికి 36కోట్ల30లక్షల రూపాయలు ప్రభుత్వం కేటాయించినట్లు లక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. భవన నిర్మాణానికి 18 కోట్ల రూపాయలు కేటాయించారని మిగతా 18 కోట్ల 35 లక్షల రూపాయలు ఎక్విమెంట్‌కు కేటాయించారన్నారు. సుమారు 10నెలల్లో భవన నిర్మాణం పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని ఆయన తెలిపారు.



పేరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

న్యాయవాది మక్కెన పేరయ్యకు ఘన నివాళి

వినుకొండ, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సీనియర్ న్యాయవాది మక్కెన పేరయ్య 4వ వర్ధంతి కార్యక్రమాన్ని పట్టణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో న్యాయవాద సంఘం అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, సెక్రటరీ గౌస్‌మొహిద్దీన్‌ఖాన్, శేఖర్‌బాబు, శివశంకరబాబు, పీజే లూకా, రామకోటేశ్వరరావు, సైదారావు, హనుమంతరావు, శ్రీనివాసరావు, ఏజీపీ జ్ఞానేశ్వరావు, చెన్నకేశవరెడ్డి, తిరుపతిరావు, బి.శ్రీనివాసులు, ఎలీషాబాబు, రమణారావు, సీతారామాంజనేయులు, విజయ్, నాగరాజు, చంటి, అప్పారావు, న్యాయవాద గుమస్తాలు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలి

- ఒమేగా హాస్పిటల్ రేడియేషన్ అంకాలజిస్ట్ డాక్టర్ గీతా రుక్మిణి

చిలకలూరిపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): మహిళలు క్యాన్సర్‌పై అవగాహన పెంచుకుని, దానిబారిన పడకుండా కాపాడుకోవాలని ఒమేగా హాస్పిటల్ రేడియేషన్ అంకాలజిస్ట్ డాక్టర్ గీతా రుక్మిణి మంగళవారం సూచించారు. స్థానిక రామకృష్ణ మెమోరియల్ నర్సింగ్ హోమ్, ఇన్నర్‌వీల్ క్లబ్ అఫ్ చిలకలూరిపేట వారి సంయుక్త ఆధ్వర్యంలో, ఒమేగా కాన్సర్ హాస్పిటల్ సహకారంతో ఉచిత కాన్సర్ నిర్ధారణ శిబిరం జరిగింది. ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు గట్టు సరోజిని అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మహిళలకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. దేశంలో మధ్య వయసు స్త్రీలు చాలా ఎక్కువగా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్‌కు గురవుతున్నారని రేడియేషన్ అంకాలజిస్ట్ డాక్టర్ గీతా రుక్మిణి అన్నారు. క్యాన్సర్లపై అవగాహన లేకపోవడం వల్ల అవి ఎన్నో జీవితాలకు శాపంగా మారుతున్నాయన్నారు. తొలినాళ్లలో గుర్తించలేకపోవడంతో ఏటా ఎంతో మంది మహిళలు వీటి బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వైకల్ (గర్భాశయ ముఖద్వార) క్యాన్సర్ మహిళలకు ఎక్కువగా సోకే క్యాన్సర్లలో నాలుగోదన్నారు. పట్టణానికి చెందిన సీనియర్ గైనకాలజిస్టులు డాక్టర్ కందిమళ్ల జయమ్మ, డాక్టర్ కొల్లా హేమంతిదేవి, డాక్టర్ లావు అరుణలు మహిళలకు వచ్చే పలు వ్యాదుల గురించి, తీసుకోవాల్సిన జాగ్రత్తల నుంచి అవగాహన కల్పించారు. డాక్టర్ వెల్లటూరి రాణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 45మంది మహిళలకు పాప్‌స్మియర్ పరీక్షలు, 40మంది మహిళలకి రొమ్ము కాన్సర్‌కు మామోగ్రామ్ పరీక్షలు ఒమేగా కాన్సర్ హాస్పిటల్ వారు నిర్వహించారు. ఇంకా 60మంది మహిళలకు ఔట్ పేషెంట్‌లుగా పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ వి.పెద్దబ్బాయి, డాక్టర్ ప్రఫుల్లాదేవి, డాక్టర్ నాగహర్షిత, డాక్టర్ రేష్మ, డాక్టర్ శ్వేతతో పాటు ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గట్టు సరోజిని, నార్నె జయలక్ష్మి, రామకృష్ణ మెమోరియల్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణపై అవగాహన

బొల్లాపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూగచింతలపాలెంలో కిషోర బాలికలకు బాల్య వివాహాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని సీడీపీవో బీ అరుణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో కిషోర్ బాలికలకు, కిషోరి వికాసం, వేసవి సెలవుల కార్యక్రమం, వ్యక్తిగత శుభ్రత, రక్తహీనతపై, బాలికల సంరక్షణ కోసం ప్రభుత్వం తీసుకు వచ్చిన పోక్సో చట్టం, లింగ వివక్షతపై వైద్య నైపుణ్యాల అభివృద్ధి, ఉన్నత ఆలోచనలు కలిగి ఉండటం, బాల్య వివాహాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆషా వర్కర్లు, గర్భిణులు, బాలింతలు, కిషోరి బాలికలు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

నరసరావుపేట రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన రావిపాటి వీరాంజనేయులు, మంజుల, హారికలు శ్రీమహంకాళి అమ్మవారి దేవస్థానం (ఇసప్పాలెం) నూతన ఆలయ నిర్మాణం కోసం విరాళం అందజేశారు. రూ.1,00,116 నగదును ఆలయ ఈవో నలబోతు మాధవిదేవికి మంగళవారం అందచేశారు.

టీడీపీ నూతన గ్రామ కమిటీల ఎన్నికలు

శావల్యాపురం, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిచికలపాలెం, చిన్నకంచెర్ల, ముండ్రువారిపాలెం, పోట్లూరు గ్రామాల్లో టీడీపీ నూతన గ్రామ కమిటీ ఎన్నికలను మంగళవారం నిర్వహించారు. పిచికలపాలెం గ్రామపార్టీ అధ్యక్షుడిగా బోడెపూడి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా కంచర్ల ఏడుకొండలు, ప్రధాన కార్యదర్శిగా తిరువీధి ఆంజనేయులు ఎన్నికయ్యారు. చిన్నకంచెర్ల గ్రామ పార్టీ అధ్యక్షుడిగా గోపు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా పెనుమాల పెద సత్యాలు, ప్రధాన కార్యదర్శిగా కొలకాని కృష్ణయ్యలు ఎన్నికయ్యారు. ముండ్రువారిపాలెం గ్రామపార్టీ అధ్యక్షుడిగా పాపసాని రామయోగయ్య, ఉపాధ్యక్షుడిగా బోయిన మాణిక్యరావు, ప్రధాన కార్యదర్శిగా కాటం వెంకటేశ్వర్లులు ఎన్నికయ్యారు. పోట్లూరు గ్రామ పార్టీ అధ్యక్షుడిగా గడిపూడి ప్రసాదు, ఉపాధ్యక్షుడిగా చల్లా శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా దావులూరి సుబ్బారావులు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను టీడీపీ సీనియర్ నాయకులు ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు గుంటూరు సాంబశివరావు మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కార్యవర్గసభ్యులు గ్రామాల్లో పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేయాలని, ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా పర్యవేక్షణ చేయాలన్నారు. సీనియర్ నేతలు గడిపూడి విశ్వనాథం, యరమాసు కోటేశ్వరరావు, గోరంట్ల హనుమంతరావు, గద్దె మస్తాన్ రావు, బొల్లా పేరయ్య, గోనుగుంట్ల వెంకట్రావు, మందలపు వెంకట నారాయణ, చింతా గంగయ్య, గోనుగుంట్ల ధనుంజయ్, పూరేటి వెంకట్రావు, గణపర్తి బుల్లబ్బాయి, తిరువీధి శ్రీనివాసరావు, దావులూరి చిన్న పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



అన్నవరం అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీవో ఉమా మహేశ్వరి

అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసం

రొంపిచర్ల, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్ల, మునమాక, విప్పర్ల సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోరి వికాస కార్యక్రమాలను మంగళవారం నిర్వహించారు. అనంతరం గ్రామంలో సీడీపీవో ఉమా మహేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయటం నేరమన్నారు. పోక్సో చట్టం గురించి వివరించారు. కిషోర బాలికల ఆరోగ్యం గురించి వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో కిషోరి వికాసం కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను ప్రదర్శించారు. హెల్ప్ లైన్ నెంబర్ల గురించి తెలియజేశారు. ఆయా కార్యక్రమాల్లో సూపర్‌వైజర్లు శశిదేవి, దేవీబాయి, షమీమ్ సుల్తానా, మహిళా పోలీసులు, గర్భిణులు, తల్లులు, బాలింతలు, అంగన్‌వాడీ, ఆషా కార్యకర్తలు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి

ఉద్యాన పంటలతో సుస్థిర ఆదాయం

- డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి

నాదెండ్ల, మే 13 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటలను సాగు చేయటం ద్వారా రైతులు సుస్థిర ఆదాయాన్ని సాధించగలుగుతారని డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సన్న, చిన్నకారు రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా ఉచితంగా పండ్ల తోటలను నాటించే కార్యక్రమంపై ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు, ఉద్యాన శాఖ, వ్యవసాయ సహాయకులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాణిజ్య పంటలు, సంప్రదాయ పంటల సాగువల్ల చీడ పీడ, వర్షాభావ పరిస్థితులు, తుఫాన్‌ల వల్ల రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. ఉద్యాన పంటల సాగుద్వారానే రైతులు దీర్ఘకాలికంగా లబ్ధి పొందుతారన్నారు. ప్రతి గ్రామంలో పది ఎకరాలు పండ్ల మొక్కలు నాటే కార్యక్రమానికి సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్లాంటేషన్ మేనేజర్ కే శిరీష, హార్టీకల్చర్ ఆఫీసర్ బీ విశాల్, ఏపీవో రామారావు తదితరులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

వినుకొండ, మే (ఆంధ్రజ్యోతి): శివయ్య స్థూపం సెంటర్‌లో రెండు రోజుల క్రితం మృతిచెందిన అనాథ శవానికి మానవసేవా సమితి అధ్యక్షుడు పీవీ సురేష్‌బాబు ఆధ్వర్యంలో మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొవిడ్ సమయంలో ఎందరో అనాథ మృతదేహాలకు అంత్యక్రియలతో పాటు పట్టణంలో నిరుపేదలకు దహన సంస్కారాలు చేయలేని పేదలతో పాటు, అనాథ మృతదేహాలకు మానవసేవా సమితి అండగా నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి భవాని శంకర్, నాగార్జున, జాబీర్, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అంత్యక్రియలు చేపడుతున్న మానవసేవా సమితి సభ్యులు

ఎమ్మెల్సీని కలిసిన ఆసుపత్రి సూపరింటెండెంట్

చిలకలూరిపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన తోకల శ్రీనివాసరావు మంగళవారం మర్యాదపూర్వకంగా ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్‌ను ఇక్కడి ఆయన నివాస గృహంలో కలిశారు. ఆయన వెంట ప్రభుత్వ ఆసుపత్రికి సంబంధించిన పలువురు డాక్టర్లు ఉన్నారు.

వ్యవసాయ కూలీల దుర్మరణం బాధాకరం: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): వినుకొండ మండలం శివాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండలం గడ్డమీదిపల్లెకు చెందిన వ్యవసాయ కూలీలు దుర్మరణం చెందడం బాధాకరమని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం సంతాపం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని అన్నారు. మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సంతాపం తెలిపారు.

కృష్ణవేణి నర్సింగ్ కళాశాలలో ముగిసిన యునెక్స్ట్ శిక్షణ

నరసరావుపేట టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక కృష్ణవేణి నర్సింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న యునెక్స్ట్ ఎంప్లాయిబిలిటీ శిక్షణ కార్యక్రమం ముగిసిందని చైర్మన్ మేదరమెట్ల రామ శేషగిరిరావు మంగళవారం తెలిపారు. యునెక్స్ట్ అనేది రాష్ట్రంలో యువతకు సాధికారత కల్పించడం లక్ష్యంగా ఉన్నతి ఫౌండేషన్ నిర్వహిస్తున్న వృత్తి శిక్షణ, ఉపాధి నైపుణ్యాల కార్యక్రమం అన్నారు. కార్యక్రమంలో స్పోకెన్ ఇంగ్లీష్, జీవిత నైపుణ్యాలు, విలువలు, ప్రాథమిక కంప్యూటర్ పరిజ్ఞానం, వారి విద్యా నేపథ్యం ఆధారంగా వృత్తి శిక్షణ అందించడం జరుగుతుంది. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు దేశ, విదేశాలలో ఉద్యోగ అవకాశాలకు దోహదపడతాయని అన్నారు. ట్రైనర్ నాగూర్ మహమ్మద్ ఆలీ షేక్ ఆధ్వర్యంలో 25రోజుల పాటు శిక్షణ ఇచ్చారని ప్రిన్సిపాల్ జ్యోత్స్న తెలిపారు. ఈ ట్రైనింగ్ ప్రోగ్రాంలో నర్సింగ్ విద్యార్థులు 62 మంది పాల్గొన్నారు. శిక్షణ కార్యక్రమం ఇన్ఫోసిస్ ద్వారా స్పాన్సర్ చేయబడిందని, అదేవిధంగా ఏపీఎస్ఎస్‌డీసీతో కలిసి నిర్వహించడం జరిగిందన్నారు.

అమర సైనికులకు నివాళి

నసరావుపేట టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని ఆర్ఆర్ఆర్ కన్వెన్షన్‌లో మంగళవారం అమర సైనికులకు ముస్లిం జనసైనికులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి, జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలానీ మాట్లాడుతూ జనసేన పార్టీకి చెందిన ముస్లింలు భారతదేశ సైన్యానికి అండగా ఉంటామన్నారు. మనదేశ సైనికులు ఘన విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. యుద్ధంలో వీరమరణం పొందిన జవానులకు, వారి కుటుంబాలకి మనో ధైర్యాన్ని కలగజేయాలన్నారు. కార్యక్రమంలో జనసేన జిల్లా అధికార ప్రతినిధి షేక్ అబ్దుల్ రహూఫ్, షేక్ నాగుల్ మీరా, షేక్ భాషా, షేక్ ఖాజా, సలామ్, నక్క గోపి తదితరులు పాల్గొన్నారు.